# దూకుడు పెంచిన ఏసిబి.. ఏప్రిల్‌లో రికార్డుస్థాయిలో 21 కేసులు

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. అవినీతి, అక్రమాస్తుల విషయాల్లో కేసుల నమోదుతో దూసుకెళ్తుంది. కేవలం ఒక్క ఏప్రిల్ నెలలో మొత్తం 21 కేసుల నమోదు అయ్యాయి. 13 ఏసీబీ ట్రాప్ కేసులు, 2 అక్రమాస్తుల కేసులు, 2 క్రిమినల్ దుష్ప్రవర్తన కేసులు, 2 ఆశ్చర్యపరిచే తనిఖీ కేసులు, 2 సాధారణ కేసులు చేసినట్లు– ప్రకటించింది. 20 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్, రిమాండ్ చేయబడ్డారు. కాగా, 5. 02 లక్షల సొమ్మును ఏసీబీ సీజ్ చేసింది. ఒక అధికారి ఇంట్లో సోదాలు చేసి 3.51 కోట్ల రూపాయల అక్రమాస్తులను గుర్తించింది. మాజీ ఊకఈ హరిరామ్ అక్రమాస్తులు మార్కెట్ వాల్యూ ప్రకారమ్ 13.50 లక్షల ఆస్తులుగా గుర్తించారు. లంచం డిమాండ్ చేస్తే 1064 కాల్ చేయాలని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు పేర్కొన్నారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :61 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 03-05-2025 | పేజీలు:4 వెల: 2.00


# కిషన్‌రెడ్డికి బీసీల గురించి ఏం తెలుసు..



హైదరాబాద్:కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి బీసీల గురించి ఏమి తెలుసని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో దానం నాగేందర్ మాట్లాడారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కిషన్‌రెడ్డికి లేదని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కులగణన ఎక్కడ చేయలేదని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణని రోల్ మోడల్‌గా తీసుకొమ్మన్నారని చెప్పారు. బీసీలం అల్ప సంతోషులమని అన్నారు. విమర్శలు ప్రతి విమర్శలు వల్ల సాధించేది ఏమీ లేదని ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు.

దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ: బీర్ల ఐలయ్య

దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో కులగణన చేసి రోల్ మోడల్‌గా నిలిచామని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఇవాళ(శుక్రవారం) సీఎల్పీ మీడియా పాయింట్‌లో బీర్ల ఐలయ్య మాట్లాడారు. సాహోసోపేత నిర్ణయాలతో దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణని ముందుకు తీసుకెళు న్నామన్నారు. జనగణనలో కులగణన చేస్తామన్న మోదీ కేబినెట్‌కి ధన్యవాదాలు తెలిపారు. దేశం అంత బీసీలకి న్యాయం జరగాలని అన్నారు. ఇక్కడ ఉన్న బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. గతంలో రాహుల్ గాంధీ పాదయాత్రలో ప్రజల సమస్యలు చూసి కులగణన జరగాలని పోరాడారని చెప్పారు. తెలంగాణలో కులగణన రాహుల్ గాంధీ విజన్ అని చెప్పారు. కేంద్రమంత్రి అయ్యి ఉండి కిషన్‌రెడ్డి ఆలోచించి మాట్లాడాలని అన్నారు. ఏ లెక్కల ప్రకారం తమ కులగణన తప్పని కిషన్ రెడ్డి అంటున్నారని నిలదీశారు. రేపు కేంద్రం కులగణన చేసిన తర్వాత ఆ లెక్కలు చూసి చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణని కేంద్రం రోల్ మోడల్‌గా తీసుకున్నందుకు రాష్ట్ర బీజేపీ నేతలకి దిమ్మ తిరిగిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి భారత్‌లో హీరోగా నిలబడటం కేంద్ర మంత్రులు జీర్ణించుకోలేక పోతున్నారని బీర్ల ఐలయ్య అన్నారు.

కవిత మాటలను స్వాగతిస్తాం..

కార్మిక దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత నిన్న నిజాలు మాట్లాడారని తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని గత పదేళ్లలో అభివృద్ధి చేయలేదని అన్న కవిత మాటలను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు కవితకి తలసరి ఆదాయం గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కొండలు, గుట్టలు, వెంచర్లకు రైతు రైతుబంధు ఇచ్చారని గుర్తుచేశారు. కేసీఆర్ కులగణనలో పాల్గొనలేదని.. అప్పుడు కవితకి సామాజిక న్యాయం ఎందుకు గుర్తుకు రాలేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేసినప్పుడు కవిత ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నపుడు కవితకి ఏం గుర్తుకురాదని విమర్శించారు. అధికారం పోయాక సామాజిక న్యాయమని కవిత అంటున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ పేదల నాయకుడని అభివర్ణించారు. ఇచ్చిన హామీలని ఒక్కొక్కటి అమలు చేస్తూ బీఆర్ఎస్ కంటే రేవంత్ ప్రభుత్వంలో మంచి పాలన అందిస్తున్నామని చెప్పారు. వరి ఏస్తే ఉరే అని చెప్పి కేసీఆర్ ఫాంహౌస్‌లో వరి పండిచినప్పుడు కవితకి రైతులు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్కడ ఎన్నికలు ఉంటే అక్కడ సంక్షేమ పథకాలు వచ్చేవని అన్నారు. గత పదేళ్లు ప్రశ్నించని కవిత తన పార్టీలో ప్రాధాన్యత తగ్గగానే ప్రశ్నించటం ప్రారంభించిందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు.

# భారత్ భారీ వ్యూహం.. పాక్‌కు కోలుకోలేని దెబ్బ!



ఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటన భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను క్రియేట్ చేసింది. ఈ నేపథ్యంలో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పేలా భారత్ ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇక, తాజాగా పాక్‌పై రెండు ఆర్థిక దాడులకు భారత్ ప్రణాళికలు చేసినట్టు సమాచారం.కాగా, పాకిస్తాన్ ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా భారత్ ప్రణాళికలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(%ఖీూఖీ%) గ్రేలిస్టులోకి పాకిస్తాన్‌ను తిరిగి చేర్చడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఉగ్రవాద కార్యకలాపాలకు ఆర్థిక సహాయాన్ని అరికట్టడంలో విఫలమయ్యే దేశాలను ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్ట్‌లో చేరుస్తుంది. గతంలో ఈ జాబితాలో ఉన్న పాకిస్తాన్‌ను తిరిగి అందులోకి చేర్చడం ద్వారా ఉగ్రవాదానికి నిధులు అందకుండా అంతర్జాతీయంగా ఆ దేశంపై ఒత్తిడి పెంచాలని భారత్ భావిస్తోంది. రెండో చర్యగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఇటీవల పాకిస్థాన్‌కు మంజూరు చేసిన 7 బిలియన్ డాలర్ల భారీ ఆర్థిక సాయ ప్యాకేజీ వినియోగంపై భారత్ తన ఆందోళనలను వ్యక్తం చేయనున్నట్టు సమాచారం. ఈ నిధులను పాకిస్తాన్ ఉగ్రవాద సంబంధిత కార్యకలాపాల కోసం దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ సంబంధిత అంతర్జాతీయ వేదికలపై ఈ అంశాన్ని లేవనెత్తాలని భారత్ యోచిస్తున్నట్టు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. భారత్ ప్లాన్ చేసిన చర్యల కారణంగా పాకిస్తాన్‌కు కోలుకోలేని దెబ్బ తగిలే అవకాశం ఉంది. ఈ ద్వంద్వ వ్యూహం ద్వారా పాకిస్థాన్ కేంద్రంగా నడుస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌లకు ఆర్థిక మార్గాలను మూసివేయాలని, తద్వారా సరిహద్దు ఉగ్రవాదాన్ని కట్టడి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. పహల్గామ్ దాడి వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు ఈ ఆర్థికపరమైన ఒత్తిడిని ఒక మార్గంగా భారత్ పరిగణిస్తున్నట్టు సమాచారం.

2022లో విముక్తి..

కాగా, 2022లో అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్‌కు కాస్త ఊరట లభించింది. ఉగ్రవాద సంస్థలకు నిధులు సరఫరా చేస్తోందన్న కారణంతో పాక్‌ను గ్రే లిస్టులో ఉంచిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ ఆ జాబితా నుంచి తొలగించింది. మనీలాండరింగ్ నిరోధక చర్యలను పాకిస్థాన్ పటిష్ఠంగా అమలు చేస్తోందని, సాంకేతిక లోపాలను పరిష్కరిస్తూ ఉగ్రసంస్థలకు నిధుల సరఫరా విషయంలోనూ పోరాటం చేసిందని ఎఫ్ఏటీఎఫ్ వెల్లడించింది. దీంతో పాక్‌ను గ్రే లిస్టు నుంచి తప్పించినట్లు తెలిపింది. గ్రే లిస్టులో ఉన్న దేశాలు అంతర్జాతీయ సంస్థల నుంచి నిధుల పొందడం చాలా కష్టం. ఈ దేశాలకు ముఖ్యంగా అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్, ఏడీబీ, యూరోపియన్ యూనియన్ వంటి సంస్థలు ఆర్థిక సాయం చేసేందుకు వెనకాడుతాయి.ఉగ్రవాదానికి ఊతమిచ్చే అతి ప్రమాదకర దేశాలను ఎఫ్ఏటీఎఫ్ బ్లాక్ లిస్ట్ జాబితాలోకి చేరుస్తుంది. కాగా, ఇప్పటివరకు ఇరాన్, ఉత్తర కొరియా మాత్రమే బ్లాక్ లిస్ట్ జాబితాలో ఉన్నాయి. బ్లాక్ లిస్ట్ నుంచి తప్పించుకోవడానికి మూడుదేశాల మద్దతు అవసరం. అయితే, చైనా, టర్కీ, మలేషియా దేశాలు పాక్‌కు మద్దతు ఇవ్వడంతో బ్లాక్ లిస్ట్‌లోకి వెళ్లకుండా బయటపడింది. తొలిసారిగా 2018 జూన్‌లో ఎఫ్ఏటీఎఫ్ పాకిస్తాన్‌ను గ్రే లిస్ట్‌లో ఉంచింది. అనంతరం వీటి నుంచి బయటపడేందుకు పాకిస్తాన్‌కు రెండు సార్లు సమయమిచ్చింది. వీటిలో భాగంగా ఉగ్రవాదులకు అందుతున్న నిధుల మూలాలను కనిపెట్టే దిశగా పాక్ చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా ఐరాస ఉగ్రవాదులుగా గుర్తించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి. అలాగే పట్టుబడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకున్నట్లు నిరూపించగలగాలి. ఐరాస గుర్తించిన ఉగ్రవాదులకు నిధులు అందకుండా ఆర్థికపరమైన ఆంక్షలు విధించాలి. ఎఫ్ఏటీఎఫ్ నిర్దేశించిన ఈ లక్ష్యాలను చేరుకోవడంలో పాక్ ఇప్పటివరకు విఫలమవుతూనే వచ్చింది. కానీ, జూన్ నెలలో ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ సమావేశంలో పాక్‌కు అనుకూలంగా ప్రకటన విడుదల చేసింది.

ధరలతో పాక్ అతలాకుతలం..

మరోవైపు.. ఇప్పటికే తీవ్ర ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్‌కు ఇప్పుడు మరో తలనొప్పి వచ్చి పడింది. పాక్‌తో వాణిజ్య సంబంధాలు పూర్తిగా నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించడంతో పాక్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ క్రమంలోనే అట్టారీ సరిహద్దును భారత్ మూసివేసింది. దీంతో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం నిలిచిపోయింది. దీంతో ఇప్పటికే తీవ్రంగా కుదేలైన పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థపై ఇది మరింత తీవ్ర ప్రభావం చూపనుంది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో పాక్‌లో ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకింది. భారీగా పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో పాక్ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రస్తుతం పాక్‌లో ఆహార ధరలు భారీగా పెరిగాయి.

# కేరళలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



తిరువనంతపురం,మే2: కాంగ్రెస్ నేత శశిథరూర్ కేరళలో ప్రధాని మోడీ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిపై మోడీ సెటైర్లు వేసారు. ఇది చూసి కొందరికి నిద్రపట్టదని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం కేరళలో పర్యటించారు. తిరువనంతపురం సమీపంలో రూ. 8,900 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన విఝింజమ్ ఇంటర్నేషనల్ డీప్‌వాటర్ మల్టీపర్పస్ సీపోర్టును ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరువనంతపురం ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హాజరయ్యారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఈ ఫొటో చూసి కొందరికి నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు. ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ ప్రోగ్రామ్ కొందమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడికి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయిందని మోదీ చమత్కరించారు. కాగా.. గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. దిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యం ఉన్నప్పటికీ.. సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా. నా నియోజకవర్గానికి వచ్చిన మోదీని సాదరంగా స్వాగతించానని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ అధినాయత్వంతో శశిథరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆ మధ్య ఓ కేంద్ర మంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారం మొదలైంది. ఇక, భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల వేళ ఆయన మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశమైంది. తిరువనంతపురం నుంచి నాలుగు సార్లు ఎంపీగా గెలిచిన శశి థరూర్ గురించి ప్రధాని నేరుగా ప్రస్తావించడం అరుదైన విషయమని చెప్పవచ్చు. అంతేకాదు ఇప్పుడు శశి థరూర్ బీజేపీలో చేరారా అనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు కేరళలోని కాంగ్రెస్ పార్టీలో థరూర్ స్థానం గురించి జరుగుతున్న చర్చల నేపథ్యంలో వచ్చాయి. ఇదే సమయంలో థరూర్ తన వ్యక్తిగత ఇమేజ్‌ను పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి వేరుగా ప్రొజెక్ట్ చేస్తున్నారనే అభిప్రాయం బలంగా వినపడుతోంది.

# పాక్ గగనతలం మూసివేత..ఎయిరిండియాకు భారీ నష్టాలు




న్యూఢిల్లీ,మే2: పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్–భారత్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్న క్రమంలో పాక్ గగనతలం మూసివేతతో ఎయిరిండియాకు భారీగా నష్టాలు వస్తున్నాయి.

పాకిస్థాన్‌పై భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. సింధు జలాలను నిలిపివేసింది.అనంతరం పాకిస్థాన్ వీసాలను రద్దు చేసింది. అంతేకాకుండా అటారీ సరిహద్దు మూసివేసింది. దీనికి బుదులగా పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసింది. తమ వైపు విమానాలు రాకుండా అడ్డుకుంది. అయితే దీని కారణంగా ఎయిరిండియా భారీ నష్టాలను ఎదుర్కొంది. పాక్ గగనతలం ఏడాది పాటు మూసివేతతో ఎయిరిండియా సంస్థకు రూ. 5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లనుందని జాతీయవార్తా సంస్థ వెల్లడించింది. ఎయిరిండియా సహా ఇండిగో, స్పైస్‌జెట్ వంటి విమానయాన సంస్థలు తాజాగా సూచనలు, సలహాలను పౌర వైమానిక శాఖకు తెలియజేశాయి. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించి తగిన పరిష్కారం వెతికే పనిలో ఆ శాఖ నిమగ్నమైంది. ఏ డాది పాటు పాక్ గగనతలం మూసివేస్తే సుమారు 600 మిలియన్ డాలర్లు అంటే రూ. 5 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని ఎయిరిండియా పేర్కొంది. ఈ నేపథ్యంలో వైమానిక సంస్థ పలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టాయి. ప్రస్తుతం దేశంలో ఎయిరిండియా,ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, స్పై స్‌జెట్, ఆకాశా ఎయిర్ అంతర్జాతీయ సర్వీసులను నడుపుతున్నాయి. వైమానిక సంస్థలకు వారానికి రూ. 77 కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా వేస్తున్నారు. ఇక భారత్ కూడా గత బుధవారం నుంచి పాకిస్థాన్ విమానాలకు మే 23వ తేదీ వరకు గగనతలం మూసివేసింది. ప్రస్తుతం రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.

# చేనేత కార్మికుల సమస్యలను కెబినేట్ లో చర్చిస్తాం



హైదరాబాద్: వ్యవసాయం, చేనేత శాఖలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రాంతం భూదాన్ పోచం పల్లి అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ లాగే.. నేతన్నలకు కూడా రుణమాఫీ చేస్తున్నామని హామీ ఇచ్చారు. ఐఎహెచ్ టిని భూదాన్ పోచంపల్లిలో నిర్మిస్తామని తెలియజేశారు. చేనేత కార్మికుల సమస్యలను కెబినేట్ లో చర్చిస్తామని పేర్కొన్నారు. సాంకేతిక సమస్యలతో పోచంపల్లి మండలంలో రైతు భరోసా రాలేదన్నారు. త్వరలోనే రైతు భరోసా అర్హులైన వారి ఖాతాలో జమ అవుతుంది తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# కాశ్మీర్‌లో విస్తృత గాలింపు చర్యలు



శ్రీనగర్,మే2: పహల్గాం దాడి తర్వాత కశ్మీర్‌లో భద్రతా దళాలు గాలింపు చర్యలను వేగవంతం చేశాయి. ఇప్పటికే తప్పించుకున్న నలుగురు ముష్కరుల కోసం గాలింపు చేపట్టిన బలగాలు, వారి మూలాలను ఆరా తీస్తున్నాయి. తాజాగా ఐసీ 814 విమానాన్ని హైజాక్ చేసిన అల్ ఉమర్ ముజాహిద్దీన్ చీఫ్ ముష్తాక్ అహ్మద్ జర్గర్‌ను ఉగ్రవాదులు విడిపించిన నేపథ్యంలో అతని ఇంట్లోను భద్రతా దళాలు సోదాలు చేశాయి. ప్రస్తుతం అతడు పాకిస్థాన్‌లో ఉంటున్నాడు. కీలక ఆధారాల కోసం సోదాలు చేపట్టారు. గత వారం 60 ఇళ్లపై ఎన్ఐఏ బృందాలు దాడులు నిర్వహించాయి. ఈసందర్భంగా మొత్తం ఇప్పటివరకు 1900 మందిని ప్రశ్నించాయి. పహల్గాం దాడికి సంబంధించి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసేందుకు ఎన్ఐఏ అత్యాధునిక విధానాలు వినియోగిస్తోంది. శాటిలైట్ ఇమేజ్‌లు, డ్రోన్ దృశ్యాలు, బాధితులు, గుర్రపు స్వారీ ఆపరేటర్ల నుంచి సమాచారం సేకరిస్తోంది. దీంతోపాటు– దాడి జరిగిన ప్రదేశాన్ని హైరిజల్యూషన్ 3డీ మోడల్‌ను కూడా తయారుచేస్తున్నట్లు– తెలుస్తోంది. ఈ మోడల్ దర్యాప్తును కోర్టులో విచారణకు ఉపయోగించనుంది. ఘటనా స్థలం నుంచి ఇప్పటివరకు 40 ఖాళీ తూటాలను దర్యాప్తు బృందాలు స్వాధీనం చేసుకొన్నాయి. అంతేకాదు.. మొబైల్ టవర్స్ నుంచి పాత డేటాను మొత్తం దర్యాప్తు బృందాలు వెలికితీస్తున్నాయి. బైసరన్ లోయలో పర్యాటకులను హత్య చేయాలన్న పథకాన్ని ప్రాథమికంగా లష్కరే తోయిబా రూపొందించిందని జాతీయ దర్యాప్తు సంస్థ ప్రాథమికంగా నిర్ధరణకు వచ్చింది. దీనికి ఐఎస్ఐ ఆపరేటివ్‌లు సాయం చేయగా.. దీనికి పాక్‌లోని లష్కరే ప్రధాన కార్యాలయంలో తుదిరూపు వచ్చింది. ఈ మొత్తం దాడికి లష్కరే ఉగ్రవాది హాషీమ్ ముసా, అలీభాయ్‌లు కేంద్రంగా నిలిచినట్లు అంచనా వేసింది. వీరిద్దరూ పాక్ జాతీయులే. ఈ ఉగ్రవాదులకు 2024లో జరిగిన గగనగర్ ఉగ్రదాడితో సంబంధం ఉందని దర్యాప్తు బృందాలు బలంగా విశ్వసిస్తున్నాయి. అయితే వీరు చీనాబ్ లోయ వైపు నుంచి వచ్చి ఉండనందున, అటువైపు వెళ్లి ఉండకపోవచ్చని భావిస్తున్నాయి. ఇకపోతే ?వరుసగా 8వ రోజు కూడా పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. అంతర్జాతీయ సరిహద్దుల వెంట కాల్పులు జరిపింది. వీటిని భారత్ బలంగా తిప్పికొట్టింది. దీంతోపాటు సరిహద్దుల వెంట ఉన్న బంకర్లను శుభ్రం చేసి.. స్థానికులు ఆశ్రయం పొందేందుకు వీలుగా సిద్ధం చేస్తున్నారు.

# ఇటు బిజెపి,అటు కాంగ్రెస్ లు అన్యాయమే చేస్తున్నాయి...



సంగారెడ్డి: తెలంగాణను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణకు అన్యాయం తప్ప ఏం చేయలేదని మండిపడ్డారు. మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రారంభించిన బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టును రేవంత్ సర్కార్ పూర్తిగా పక్కన పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హరీశ్‌రావు సమక్షంలో నేడు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. సంగమేశ్వర ప్రాజెక్టు పూర్తయితే జిల్లా మొత్తం సాగు నీటితో సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. బసవేశ్వర ప్రాజెక్టు పూర్తి చేయడానికి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని వెల్లడించారు. తాగు, సాగు నీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బీఆర్ఎస్ ఉన్నపుడు వచ్చిన నీళ్ళు ఇప్పుడు

## సంపాదకీయం

**శనివారం 03-05-2025**

# కార్మికుల స్వేదానికి వెలకట్టని చట్టాలు !

మేడే అనగానే గుర్తుకు వచ్చేది కార్మిక వర్గమే. వారు లేనిదే పరిశ్రమలు లేవు..జీవనం లేదు.. అయినా ఏటా మేడేలు జరుపుకుంటున్నా వారిని ఆదరించే తీరులో మాత్రం చిత్తశుద్ధి కానరావడం లేదు. వారిని నేటికి బానిసలు గానే చూస్తున్న తీరు దారుణం. కార్మిక వర్గాన్ని అక్కున చేర్చుకోవాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. చట్టాలు పరిశ్రమల యాజమాన్యాలకు చుట్టాలుగా మారుతున్నాయి. కనీస వేతనాలు, అమలు కావడం లేదు. పనిదినాలు, పనిగంటలు అన్నవి లేకుండా పోతున్నాయి. దేశంలో కార్మికులను అణచివేసే రాక్షస యాజమాన్యాలకే ప్రభుత్వాలు అండగా ఉంటున్నాయి. వారికి ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్న కారణంగా, కార్మికసంక్షేమం అన్నది మేడిపండు చందంగా మారింది. కార్మికుల పోరాటాల్లో నుంచి మేడే పుట్టినా...నిత్యం వారికే అన్యాయం జరుగుతోంది. వారినే యాజమాన్యాలు చులకన చేస్తున్నాయి. ఏటా మేడేలు జరుపుకుంటున్నా స్వేదం చిందిస్తున్న కార్మికులను ఇంకా బానిసలుగా చూస్తున్న ఘటనలు కోకొల్లలు. ముఖ్యంగా కార్పోరేట్ రంగం విస్తరించిన తరవాత కార్మికుల జీవితాలకు, జీతాలకు విలువ లేకుండా పోయింది. ప్రధానంగా పనిదినాలు, పనిగంటలు అన్నవి మృగ్యం అయ్యాయి. నిబంధనల మేరకు అనే పద్దతి పోయింది. కంపెనీల నిబంధనల మేరకు పనిచేయాల్సి వస్తోంది. కార్మికచట్టాలు అన్నీ చూడడానికి ఉన్నా, అమలు మాత్రం కావు. ఏవైనా ఫిర్యాదులు చేసినా పట్టించుకోరు. ఇకపోతే శ్వేదం చిందిస్తూ మిద్దెలు,మేడెలు కడుతున్నా..వారికి కనీసం గూడు ఉండడం లేదు. వారి పిల్లలకు చదువూసంధ్యా దక్కడం లేదు. వ్యవసాయం నుంచి అన్నిరంగాల్లో వారి చెమట లేకుండా ఏ పనీ జరగడం లేదు. సర్వసంపదలు సృష్టించే శ్రామికవర్గం అన్నది గుర్తింపు లేకుండా పోయింది. శ్రమజీవులు ప్రపంచ వ్యాప్తంగా తమ సత్తా ఏమిటో చాటారు.కార్మికులు తమ స్వేదాన్ని రక్తంగా చిందించి లాభాలు తెచ్చి పెడుతున్నా, నేటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదు.ఎన్నో పోరాటాల ద్వారా కార్మిక హక్కులు సాధించుకున్నా.. నేటికీ అవి అమలు కావడం లేదు. 8 గంటల పని హక్కు కోసం ఆనాటి ప్రభుత్వాల మెడలు వంచి పని గంటల హక్కు సాధించారు. తమ హక్కుల సాధన కోసం వందలాది మంది ప్రాణాలు అర్పించారు. పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు ఉండడం లేదు. తమ డిమాండ్లపై నినదించిన వారిని తక్షణం ఉద్యోగాల నుంచి తొలగస్తున్నారు. ఉద్యోగాలు తొలగించినా... నోటీసులు ఇవ్వకున్నా కార్మిక సంక్షేమ శాఖ చూసీచూడనట్లుగా ఉంటోంది. ఇకపోతే మరీముఖ్యంగా ఆడవాళ్లు వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తోంది. తమపై అధికారులు వారిని సెక్స్ బానిసలుగా చూస్తున్నారు. ఇది చాలా తీవ్రమైన విషయం దీని ఇంకా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే కార్మికుల పిల్లలకు విద్యా,ఉద్యోగ సౌకర్యాల కల్పన లేదు. వారికి ఆరోగ్య సమస్యలపై పెద్దగా స్పందించడం లేదు. అలాగే అర్థాంతరంగా కంపెనీలను, సంస్థలను మూసేసి కార్మికలు నోట్లో మట్టికొడుతున్నా కార్మిక చట్టాలు పనిచేయడం లేదు. నేటికీ ఇంకా ఫ్యూడల్ భావాల నుంచి యాజమాన్యాలు బయటపడడం లేదు. మారిన ప్రపంచ పటంలో మారుతున్న కాలంలో ఇంకా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. కార్మికులను అణచివేసేందుకు యాజమాన్యాలు కొత్తకొత్త పద్దతులను అనుసరిస్తున్నాయి. యాజమాన్యాలకు వత్తాసు పలికే బూర్జువా విధానాలను ప్రభుత్వాలు విడనాడాలి. అప్పుడే మేడేకు సార్ధకత చేకూరుతుంది. పారిశ్రామికీకరణ తరవాత కూడా మార్పులు రావడం లేదు. కార్మికులకు హక్కులు లేకుండా చేస్తున్న యాజామాన్యాలకు అనుగుణంగా చట్టాలు తీసుకుని రావడం దారుణం. ఈ పరిస్థితులనుంచి బయటపడాలి. పక్కాగా శ్రామిక చట్టాలు అమలు చేసి వారికి అండగా నిలవాలి. కార్మిక హక్కులు, పోరాటాలు, త్యాగంతోనే సాధ్యం అయ్యాయి. కానీ ప్రభుత్వాలు కార్పోరేట్ కంపెనీల మోచేతి నీళ్లు తాగుతూ..కార్మికులకు ద్రోహం చేస్తున్నాయి. ఇవాళ మనం చూస్తున్న ఈ ప్రపంచం, అభివృద్ది అంతా కూడా కార్మికుల శ్వేదం చిందిస్తేనే సాధ్యం అయ్యిందన్న విషయం మరచిపోతున్నాం. కార్మికవర్గం లేకుంటే తమకు పురోగతి లేదన్న భావనలో లేరు. పారిశ్రామిక విప్లవం ప్రారంభదినాల్లో కార్మికులను బానిసల వలే పని చేయించారు. కార్మికులు రోజుకు 16 నుంచి 20 గంటల వరకు పని చేసేవారు. అయితే చైతన్యం పెరగడంతో మెల్లగా 19వ శతాబ్దం ప్రారంభం నుంచి కార్మికులు తిరుగుబాట్లు ప్రారంభించారు. ఆనాడు కార్మికులకు ఎటువంటి భద్రత గాని, సౌకర్యాలు గాని వుండేవి కాదు. ఫ్యాక్టరీల్లో గాలి, వెలుతురు సౌకర్యాలు మృగ్యం. కార్మికులకు యంత్రాల నుండి రక్షణ లేదు. తరచుగా ప్రమాదాలకు గురై మరణించే వారు. కార్మికులు అమానుష శిక్షలకు గురవుతుండేవారు. కార్మికులు తమ పీడనకు వ్యతిరేకంగా యంత్రాలను ధ్వంసం చేసేవారు. ఈ విధ్వంసకాండ బ్రిటన్‌లో ప్రారంభమైంది. యంత్రాలను విచ్ఛిన్నం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ బ్రిటన్‌లో చట్టం చేసారు. ఈ దుస్థితి నుంచి బయట పడడానికి పోరాటం సల్పడం ఒక్కటే మార్గమని కార్మికవర్గం అర్ధం చేసుకుంది. కార్మిక వర్గం చైతన్యవంతంగా వున్న దేశాల్లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం ప్రారంభ మైంది. 1806లో అమెరికాలోని ఫిలడెల్ఫియా కార్మికులు సమ్మె చేశారు. ఫిలడెల్ఫియా నగరంలో 'మెకానిక్స్ యూనియన్' పేరుతో కార్మిక సంఘాన్ని స్థాపించారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు సంఘాలను నిర్మించుకొని పోరాటాలు సాగించారు. ట్రేడ్ యూనియన్ల మహత్తర శక్తిని చూసి పాలకులు హడలెత్తిపోయారు. 1886 చికాగో కార్మికుల పోరాటం,884 అక్టోబర్‌లో అమెరికా, కెనడాల ఆర్గనైజ్డ్ ట్రేడ్ అండ్ లేబర్ యూనియన్ల నాలుగవ మహాసభ జరిగింది. 1886 మే నుండి 8 గంటల పని చట్టబద్దమైన పనిదినంగా వుంటుందని తీర్మానం చేసింది. మే 1వ తేదీన సమ్మె చేయాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చింది. 'మనిషి జీవితంలో రోజులో 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల దినచర్య' అనే శాస్త్రీయ పద్ధతి కోసం పోరాడాలని నిర్ణయించారు. ఈ పిలుపుకు అశేషమైన స్పందన వచ్చింది. వేలాది మంది కార్మికులు అనేక సంస్థలు '8 గంటల పని దినం' కోసం మే1వ తేదీన సమ్మెలో పాల్గొన్నారు. 1889లో ప్యారిస్‌లో జరిగిన సోషలిస్టు ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ మేడేను అంతర్జాతీయ కార్మికదినంగా అమలు చేయాలని తీర్మానాన్ని రూపొందించింది. అప్పటి నుంచి మేడేను అధికారికంగా కార్మికలోకం జరుపుకుంటోంది. ఆతరవాత జరిగిన పరిణామాల నేపథ్యంలో కార్మికవర్గ కార్యక్రమాలు బాగా పెరిగాయి. ఈ అనుభవాను గుర్తించినా రానురాను ఈ ఆధునిక యుగంలో కార్పోరేట్ కంపెనీలన్నీ ప్రభుత్వాలతో కుమ్మక్కయి కార్మికులను అణచి వేస్తున్నారు. ఈ క్రమంలో మరో కార్మికోద్యమానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మేల్కొని అప్రమత్తంగా ఉండకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు.

# కుడితిలో పడ్డ ఎలుకలా కాంగ్రెస్ !

న్యూఢిల్లీ,కులగణనపై కేంద్రం అనూహ్య నిర్ణయం తీసుకోవడంలో రాజకీయ ఎత్తుగడ ఉండే ఉంటుంది. పహల్గాం సంఘటనకు ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం అసాధారణ రీతిలో ప్రతిస్పందించే అవకాశాలు ఉన్నాయని అందరూ భావిస్తున్న తరుణంలో అనూహ్యంగా కేబినేట్ కులగణన నిర్ణయం తీసుకుంటుందని ఎవ్వరూ ఊహించలేదు. ఓ రకంగా కులగణనతో మోడీని ఇరుకున పెట్టాలని చూసిన రాహుల్‌ను గట్టి దెబ్బే కొట్టారని అనుకోవాలి. తెలంగాణ రోల్ మోడల్ అంటూ రాహుల్ ఎంతగా వగచినా...ఇక్కడ చేసిన కులగణనతో ఒరింగేమీ లేదు. కులగణన చేపట్టామని చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి ముందుగా సిఎం సీటును బిసిలకు ఇవ్వలేరు. ఇవ్వాలని రాహుల్ కూడా పట్టుబట్టలేరు. అలాగే కులగణన కావాలంటూ గొంతుచించుకుంటున్న రాహుల్ తమ కుటుంబంలోని మూడు పార్లమెంట్ సీట్లను ముగ్గురు బిసిలకు ఇవ్వలేరు. కేవలం రాజకీయ డ్రామాల కోసం ఏదో ఒక సమస్యను తెరపైకి తేవడం, వాదులాడడం, గొంతు చించుకోవడం తప్ప..నిజంగా పేదలకు మంచి చేయాలన్న ధృఢసంకల్పం రాజకీయ నాయకుల్లో కొరవడుతోంది. దళితులు, ఆదివాసీలు, బిసిల పేర్లు చెప్పి ఓట్లు దండుకునే యత్నం తప్ప మరోటి కాదు. దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మధ్యలో కొన్నేళ్లు తప్ప కాంగ్రెస్ అధికారంలో ఉన్నా..కులగణనపై నోరు మెదపలేదు. పదేళ్ల యూపిఎ పాలనలో కూడా రాహుల్‌కు ఈ ధ్యాస రాలేదు. మోడీ అధికారంలో రావడం...పాతుకు పోగానే రాజ్యాంగం, కులగణన గుర్తుకు వచ్చి ఊరూవాడా ప్రచారం చేసుకుంటున్నారు. తెలంగాణలో కూడా అనేకానేక సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించే ప్రయత్నాలు చేయడం లేదు. ఎన్నికల ముందు ప్రస్తావించిన సమస్యలపై పట్టింపు లేదు. అవినీతిలో కెసిఆర్ మునిగాడని, పదిలక్షల కోట్లు సంపాదించారని పదేపదే పాటపాడుతున్న అధికార కాంగ్రెస్ అవినీతిని రుజువు చేయలేక చతికిల పడింది. అందుకే రాజకీయాల్లో ఎవరి ఎజెండాలు వారివే. వాటిని తిప్పికొట్టేందుకు సహజంగానే ఎత్తులు వేస్తుంటారు. కాంగ్రెస్‌ను మరింత దెబ్బకొట్టే ఉద్దేశ్యంతో ఇక వారికి ఈ అంశంపై మాట్లాడే అవకాశం లేకుండా చేయడమే మోడీ ఎత్తుగడగా కనిపిస్తోంది. కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఇలాగే చూడాలి. కులగణనకు నెహ్రూ వ్యతిరేకమంటూ, రిజర్వేషన్లను రాజీవ్‌గాంధీ లోక్‌సభలోనే వ్యతిరేకిం చారంటూ బిజెపి నుంచి విమర్శలు వచ్చాయి. మండల్ కమిషన్ సిఫార్సులను ఇందిరాగాంధీయే తొక్కిపట్టారని ఆరోపణలూ ఎక్కుపెట్టారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కులగణన గురించి ఆలోచన చేయలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదన్న బిజెపి ప్రశ్నలకు కాంగ్రెస్ వద్ద సమాధానం లేదు. కాంగ్రెస్ తన విధానాలకు భిన్నంగా కులగణనను ప్రధాన రాజకీయ అజెండాగా మలచుకుని దానిచుట్టే కార్యాచరణను రూపొందించుకుంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 400 సీట్ల ఆధిక్యతను సాధించకుండా చేయటంలో కాంగ్రెస్ రాజ్యాంగం, కులగణన ప్రచారం బాగానే అడ్డుపడింది. మోదీ కోరినట్లుగా 400 లోక్‌సభ స్థానాలను కట్టబెడితే రిజర్వేషన్లను బీజేపీ రద్దుచేస్తుందని కాంగ్రెస్ ముమ్మరంగా ప్రచారం చేసింది. దేశంలోనే మొట్టమొదటి సారిగా, ఎంతో పకడ్బందీగా తెలంగాణలో కులగణనను విజయవంతంగా పూర్తిచేశామనీ, దీనికి తామే రోల్ మోడల్ అని రేవంత్‌రెడ్డి ఇప్పటికీ పదేపదే ప్రచారం చేస్తున్నారు. అందుకే బిజెపి ఓ రకంగా ఎత్తుకు పైఎత్తు వేసిందనే చెప్పాలి. కాంగ్రెస్ ఎక్కుపెట్టిన కులగణన అస్త్రంను దెబ్బతీసే ఆలోచనలో భాగంగానే బిజెపి జనగణన–కులగణను ఆమోదించి ఉంటుంది. ఓ రకంగా రాజకీయంగా కాంగ్రెస్‌ను



దెబ్బకొట్టే ప్రయత్నం గానే చూడాలి. ఇది కాంగ్రెస్ చంకలు గుద్దుకుని ఎగిరే సందర్భం కూడా కాదు. బిజెపిని తక్కువ అంచనా వేసిన రాహుల్ తను తీసుకున్న గోతిలో తానే పడ్డారు. బిజెపి ఇలా చేస్తుందని ఊహించవుండరు. కులగణనపై కాంగ్రెస్ రాజకీయంగా మరింత విజృంభించకుండా బీజేపీ పావులు కదిపిందని చెప్పాల్సిందే. కులంతో పాటు ఉద్యోగ, విద్య, ఆస్తుల వివరాలను పక్కాగా సేకరించి వాటిని బహిరంగపరిస్తే అసలు రంగు బయటపడుతుంది. ఒక్క కులంతోనే సరిపుచ్చుకుండా సామాజికంగా వారి అర్థిక స్థిగతులను కూడా వెలికి తీస్తే మంచిది. అప్పుడు కుల జనాభాను బట్టి ఉద్యోగాలు, పదవులు ఉండాలని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న డిమాండ్‌కు అర్థం లేకుండా పోతుంది. ఎందుకంటే మారిన ప్రపంచ పరిస్థితుల్లో కులాల ఆధారంగా వారి ఆర్థిక సామాజిక పరిస్థితిని నిర్వచించలేని రోజులు ఇవి. కుల రిజర్వేషన్లు వచ్చినా అవి కేవలం..ప్రభుత్వ ఉద్యోగాలకూ, ప్రభుత్వ విద్యాసంస్థలకూ మాత్రమే పరిమితం అయ్యే అవకాశాలే ఎక్కువ. ప్రైవేటు రంగానికి కూడా రిజర్వేషన్లను వర్తింపచేయాలనే డిమాండు ఉధృతమైనా ఆచరిం చడానికి ఆయా సంస్థలు సిద్దంగా లేవు. అలా చేస్తే వారు బిచాణా ఎత్తేస్తారు. నిజానికి కులాలకు ఎంతవరకూ రిజర్వేషన్లు ఉండాలన్న విషయంపై రాజకీయంగా ఇప్పటివరకూ ఏకాభిప్రాయం లేదు. కులజనాభాను బట్టి వాటాలు నిర్ణయించి, ఉద్యోగావకాశాలు ఇవ్వాలనే డిమాండ్ వస్తే..అది రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తుంది. ముందుగా రాజకీయంగా పదవులను ఇవ్వాలని కోరుతారు. సిఎంలు మొదలు మంత్రుల వరకు ఇప్పుడు పదవులు అనుభవిస్తున్న వారు చాపచుట్టేసి ఇంట్లో కూర్చోవాల్సి వస్తుంది. రాజకీయ రిజర్వేషన్లు లేకుండా మిగతా చోట్ల డిమాండ్ అన్నది సాధ్యం కాదు. అందుకే కేవలం కులాల లెక్కలు సేకరించడంతో పాటు, ఆర్థిక స్థితిగతులను కూడా పక్కాగా తెలిస్తేనే ఏయే కులాల్లో ఎంతమంది పేదలు ఉన్నారో తేలుతుంది. జనాభా సేకరణలో కులలెక్కలు చేపట్టం మొదలయితే ఇక ప్రతిసారీ ఇది కొనసాగించాల్సి ఉంటుంది. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వ హయాంలో పదేళ్లక్రితం వందకోట్లకు పైగా ఖర్చుపెట్టి చేసిన కులగణనపై ఏకాభిప్రాయాన్ని సాధించలేకపోయారు. ఇప్పటికీ ఆ కుల నివేదికను బయటపెట్టలేక పోతున్నారు. కర్ణాటకలో రెండు ప్రధాన కులాలైన వక్కలిగలు, లింగాయతులు తమ జనాభాను తక్కువగా చూపించారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. తెలంగాణ కులగణనపైనా విమర్శలు ఉన్నాయి. చాలాందిని లెక్కల్లోకి తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో కులగణన ద్వారా ఏం సాధిస్తారో కాంగ్రెస్ చెప్పగలగాలి. పార్టీపరంగా అమలుచేయగలగాలి. అప్పుడే డిమాండ్‌కు అర్థం ఉంటుంది. మొత్తంగా కులగణన చేపట్టాలన్ననిర్ణయంతో కాంగ్రెస్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యిందనే చెప్పాలి.

# రైతులను వెంటాడుతున్న వానగండం

వరంగల్,చెడగొట్టు వాన రైతులను వెంటాడుతోంది. ఇటీవల పలు జిల్లాలో కురుస్తున్న వడళ్ల వానకు రైతులు ఆగమాగం అవుతున్నారు. రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం, మామిడి పంటలు వానలకు దెబ్బతిన్నాయి. భూపాల్‌పల్లి జిల్లాలో పలు మండలాల్లో అకాల వర్షం మామిడి పంటను దెబ్బతీసింది. ఈదురుగాలుతో రాళ్ల పడడంతో చేతికొచ్చిన వడ్లు పొలంలోనే రాలిపోయాయి. చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. వరితో పాటు మక్కజొన్న, మామిడి, కూరగాయల పంటలు కూడా దెబ్బతిన్నాయి. మామిడి తోటల్లోని మామిడి కాయలు నేలరాలాయి. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు. అయితే తమకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు. ఖమ్మం జిల్లాలో పలుచోట్ల అకాల వర్షాలతో బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలకు పంట నేలకూలింది. దాదాపు పది లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం. కారేపల్లి మండలంలో ఇలా పంటలు దెబ్బతిన్నాయి.అలాగే పలు జిల్లాల్లో అక్కడక్కడా మరోమారు అకాల వర్షాలు అన్నదాతను అతలాకుతలం చేశాయి. ఇప్పటికే కురిసిన భారీ వడగళ్ల వాన రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. మళ్లీ బుధవారం సాయంత్రం పలు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు చాలా వడగళ్లు పడ్డాయి. పంటలు దెబ్బతినగా, కోసి ఆరబోసిన వడ్లు మరోసారి తడిశాయి. జిల్లాలోని ఆయా గ్రామాల్లో కోసి కొనుగోలు సెంటర్లు, రోడ్లపై ఆరబోసిన వడ్లు వరదల్లో కొట్టుకుపోయాయి.

## పాతపద్దతిలో విఐపి బ్రేక దర్శనాలు

తిరుమల, తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాల కొత్త షెడ్యూల్ గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 5.30 గంటలకు మొదలై ఉదయం 11 గంటలకు ముగిసేవి. అయితే రాత్రి వేళల్లో కంపార్టుమెంట్లలో వేచి ఉండే భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించాలనే ఉద్దేశంతో గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను ఉదయం 10 గంటలకు మార్చారు. అయినప్పటికీ జనరల్ బ్రేక్ దర్శన భక్తులకు మాత్రం ఉదయం 8 గంటల నుంచి 10 గంటలోపు దర్శనం చేయిస్తున్నారు. ఇక, రెండవ నైవేద్యం గంట.. అంటే ఉదయం 10 గంటల తర్వాత ప్రొటోకాల్, రెఫరల్, శ్రీవాణి, ఉద్యోగులకు దర్శనం చేయిస్తున్నారు. దాదాపు మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ బ్రేక్ దర్శనాలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటైన ధర్మకర్తల మండలి తిరిగి బ్రేక్ దర్శనాల్లో పూర్వపు విధానాన్ని అమలుచేయాలని తీర్మానించింది. ఇందులో భాగంగా గురువారం నుంచి తిరిగి పాత పద్ధతిలో బ్రేక్ దర్శనాలను ప్రవేశపెట్టేందుకు టీటీడీ సిద్ధమైంది. ప్రొటోకాల్, రిఫరెల్, జనరల్ బ్రేక్ దర్శనాలను ఉదయం 7.30 గంటల లోపు పూర్తి చేసి తర్వాత వీలైనంత మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించి తిరిగి 10.15 గంటల నుంచి 11.30 గంటలలోపు శ్రీవాణి, టీటీడీ ప్రస్తుత, రి–టైర్డ్ ఉద్యోగులకు దర్శనం కల్పించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇక సిఫారసు లేఖలపై బ్రేక్ దర్శనాలనూ గురువారం నుంచి రద్దు చేసిన క్రమంలో ఉదయం గంట, మధ్యాహ్నం గంటన్నర అదనంగా సామాన్య భక్తులకు దర్శన సమయం లభించనుంది.

# తీవ్రత లేని తీర్మానం ...



న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్రఘాతుకాన్ని తీవ్రంగా ఖండిస్తూ ప్రపంచ దేశాలకు కనువిప్పు కలిగేలా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం పాఠం ఉంటుందని భారత్ ఆశించింది. కానీ తీర్మానం ఎవరికీ ఏమాత్రం నొప్పి కలగని రీతిలో మొక్కుబడి తంతుగా ముగిసింది. " అంతర్జాతీయ శాంతిభద్రతలకు తీవ్రమైన ప్రమాదం కలిగించే బహు రూపాల్లో, వ్యక్తీకరణల్లో ఉగ్రవాదం నెలకొంది. ఉగ్రవాద మూకలను, వారిని పెంచి పోషిస్తున్న బాధ్యులను చట్టం ముందుకు తీసుకురావలసిన అవసరం ఉంది" అని తీర్మానం ప్రకటించింది. ఈ ప్రకటనలతో ఎలాంటి ఫలితం ఉండదన్న సంగతి అందరికీ తెలిసిందే. పహల్గాం దాడికి తామే బాధ్యులమని ది రెసిస్టెన్స్ ఫోర్స్ (టిఆర్‌ఎఫ్) మొదట్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ టిఆర్‌ఎఫ్ పేరు తీర్మానంలో ఎక్కడా ప్రస్తావించలేదు. అలాగే టిఆర్‌ఎఫ్ వంటి ఉగ్రవాద పిల్ల సంస్థలకు మూలవేరుగా పేర్కొనే లష్కర్ ఇ తొయిబాను ఉగ్రవాద సంస్థగా భద్రతా మండలి ఎప్పుడో గుర్తించింది.పహల్గాం దాడి వెనుక లష్కర్ ఇ తొయిబా ప్రేరణ ఉందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ లష్కర్ ఇ తొయిబా పేరు కానీ, దీంతో సంబంధం ఉన్న గ్రూపుల విషయం కానీ తీర్మానంలో ఎక్కడా పేర్కొనక పోవడం విశేషం. ముస్లిమేతరులను టార్గెట్ చేసుకున్న ఉగ్రవాదుల గురించి కానీ, మతపరమైన ఉద్రిక్తతలను ప్రేరేపించే లక్షం పెట్టుకున్న విద్రోహ చర్య గురించి కానీ, తీర్మానంలో రేఖామాత్రమైనా ప్రస్తావించలేదు. ఉగ్రవాద నిర్మూలన ప్రయత్నంలో గతంలో మాదిరిగా భారత ప్రభుత్వంతో అన్ని దేశాలూ సహకరించాలన్న సూచన కూడా తీర్మానంలో చోటు చేసుకోలేదు. ఇదివరకటి తీర్మానాలతో పోలిస్తే ఇప్పటి తీర్మానం భాష ముసాయిదా పూర్తిగా నీరు కారిపోయినట్టు స్పష్టమవుతోంది. రాజీ పూర్వకంగా అందరికీ ఆమోదయోగ్యమైన భాషను ఉపయోగించినట్టు తెలుస్తోంది. దీని వెనుక పాకిస్థాన్, చైనా దేశాల ప్రభావం ఉన్నట్టు చెప్పవచ్చు.భద్రతా మండలికి శాశ్వతేతర సభ్య దేశంగా ఈ ఏడాదే పాకిస్థాన్ ఎన్నికైంది. పాకిస్థాన్‌కు సర్వకాల మిత్రదేశం చైనా. పాకిస్థాన్‌ను ఇరకాటంలో పెట్టే సంక్లిష్టమైన తీర్మానాలను తీసుకురాకుండా చూడడంలో చైనా హస్తం ఉంది. గతంలో కూడా అనేకసార్లు పాకిస్థాన్ పక్షాన చైనా నిలిచిన ఉదంతాలు ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడిపై తమపై వచ్చిన ఆరోపణలపై ప్రపంచ దేశాల దృష్టిని మళ్లించేందుకు పాకిస్థాన్ ఎంతో ప్రయత్నిస్తోంది. దానికి చైనా, అమెరికా సాయం కోరుతోంది. ఈ సందర్భంలో పహల్గాం దాడిపై నిష్పాక్షిక దర్యాప్తును వేగవంతం చేయాలని పాకిస్థాన్ డిమాండ్ చేస్తోంది. దానికి చైనా వంత పాడుతోంది. అమెరికా, రష్యా, బ్రిటన్ దేశాలైనా సరే పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏ తీర్మానం తీసుకువచ్చినా ఆమోదం లోకి తీసుకురావద్దని ప్రస్తుత భద్రతా మండలి అధ్యక్షుడు , ఫ్రాన్స్ దౌత్యవేత్తకు పరోక్షంగా చైనా సంకేతాలందిస్తోంది.ఫలితంగా భద్రతా మండలి తీర్మానం పసలేక మెత్తగా వెలువడింది. తీర్మానంలో టిఆర్‌ఎఫ్ పేరు లేకుండా చేయడంలో అమెరికాతో కలిసి చైనా లాబీ చేయడంలో కృతకృత్యురాలైంది. ఎలాంటి సాక్షాధారాలు లేవని టీఆర్‌ఎఫ్‌ను తప్పించింది. దీంతో టీఆర్‌ఎఫ్ తన ఇదివరకటి ప్రకటనను ఉపసంహరించుకుంది. టీఆర్‌ఎఫ్ పేరును తొలగించి భద్రతా మండలి తుది తీర్మానం ఖరారు చేసిన తరువాత పాకిస్థాన్ విధానపరమైన వైఖరికి అనుకూలంగా తనకు తాను మలచుకుంది. పాకిస్థాన్ సార్వభౌమత్వాన్ని , భద్రతను చైనా సమర్ధిస్తుందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఝీ ప్రకటించడం ఈ సందర్భంగా గమనార్హం. పాకిస్థాన్‌లో వివిధ ప్రాజెక్టుల్లో కొన్ని వేల మంది చైనా జాతీయులు పనిచేస్తున్నారు. మిత్రదేశమైన పాకిస్థాన్‌ను ఉగ్రవాద విషయంలో తూర్పారపట్టితే పాక్‌తో వైరం కొని తెచ్చుకోవలసి వస్తుందని, పాక్ లోని చైనా జాతీయులకు రక్షణ లేకుండా పోతుందని చైనా ముందుచూపుతో వ్యవహరిస్తోంది. భద్రతా మండలి వ్యవహారం భారత్‌కు అసంతృప్తి కలిగిస్తోంది.ఉగ్రవాదాన్ని ఖండిస్తూ అత్యంత కఠినమైన పదజాలంతో తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ప్రవేశ పెట్టాలన్న ఆలోచనలో భారత్ ఉంది. పాకిస్థాన్ స్థావరంగా ఉగ్రకార్యకలాపాలు సాగిస్తున్న జైష్ ఇ మొహమ్మద్ చీఫ్ మసూద్ అజహర్ నిర్వాకాన్ని పుల్వామా దాడి తరువాత భారత్ ప్రపంచానికి చాటి చెప్పింది. పహల్గాం దాడికి బాధ్యులైన టిఆర్‌ఎఫ్ వంటి ఉగ్రసంస్థలను ఐక్యరాజ్య సమితి వేదికగా ప్రపంచ దేశాలకు నిరూపించాలన్న పట్టుదలతో భారత్ ఉంది. 2008 లోముంబై, 2019 లో పఠాన్‌కోట్, 2019లో పుల్వామా ఉగ్రదా డులు జరిగిన నేపథ్యంలో అలాంటి ఉగ్రదాడులకు వీలు కల్పించకుండా ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తామని పాకిస్థాన్ గతంలో అనేక సార్లు భారత్‌కు ద్వైపాక్షిక చర్చలో హామీలు ఇచ్చింది. కానీ ఏవీ నెరవేర్చలేకపోయింది. భారత్‌తో దౌత్య పరమైన సంబంధాలు కూడా సరిగ్గా సాగించడం లేదు.పాకిస్థాన్ ఆర్థిక మూ లాలపై వేటు వేయాలన్నది భారత్ ప్రధాన లక్ష్యం. ఉగ్రసంస్థలకు పాకిస్థాన్ ని ధులు అందిస్తోందన్న కారణం చూపించి ఫైనాన్షియల్ టాస్క్ ఫోర్స్ ముందు పాక్‌ను నిలబెట్టాలని భారత్ సిద్ధమవుతోంది. 2012 నుంచి 2015,2018 నుంచి 2022 సమయాల్లో పాకిస్థాన్‌ను గ్రే లిస్టులో ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్సు ఉంచిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ప్రపంచ వేదిక సాక్షిగా ఉగ్రవాద నిర్మూలనకు బహుముఖ ప్రయత్నాలు చేయాలని భారత్ యోచిస్తోంది. ముంబై ఉగ్రదాడుల్లో కీలక పాత్ర వహించిన ఉగ్రవాది తహవూర్ రాణాను అమెరికా నుంచి బహిష్కరింప చేసి ఏ విధంగా భారత్ తన చట్టం ముందుకు తీసుకు రాగలిగిందో అదే విధంగా పహల్గాం ఉగ్రదాడి ముష్కరులను న్యాయస్థానం ముందు నిలబెట్టగలిగితేనే పహల్గాం దాడిలో అమరులైన వారికి ఆత్మశాంతి లభిస్తుంది.

## మామిడికాయల వ్యాపారి దారుణ హత్య

తిరుపతి,తిరుపతి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. పాకాల మండలం దామలచెరువులో మామిడి కాయల వ్యాపారి హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని దుండగులు ఆయనపై తీవ్రంగా దాడి చేసి హత్య చేశారు. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మామిడి కాయల వ్యాపారి సత్రాల అశోక్ పై దుండగులు రాయితో తీవ్రంగా దాడి చేసి హతమార్చారు. అనంతరం అతని వద్దనున్న బంగారం అపహరించుకొని పోయారు.

# సరికొత్త వ్యూహాలు...

హైదరాబాద్,తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని భారతీయ జనతా పార్టీ పట్టుదలతో ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటుకుంటామని, అధికారంలోకి వచ్చేస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ సింగిల్ డిజిట్‌కే పరిమితమై చతికల పడింది. లోక్‌సభ ఎన్నికల్లో ఫర్వాలేదు అనిపించుకున్నప్పటికీ.. ఆశించిన లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోయింది. ఇకలాభం లేదనుకుంటున్న కాషాయ నేతలు హిందుత్వ ఎజెండానే నమ్ముకుంటున్నారా? ముమ్మందు రాబోయే ఎన్నికల్లో గెలుపు రుచి చూడాలంటే హిందుత్వ జెండాను బలంగా మోయాల్సిందేనా..?అసలు ప్రజా క్షేత్రంలో బలం పెంచుకోవడంలో కాషాయ పరివార్ ఎక్కడ విఫలమవుతోంది..?

**జనజాగరణ పేరుతో ప్రజలకు చేరువవ్వడంపై బీజేపీ ఫోకస్**

కమల దళం ప్రజాక్షేత్రంలో పోరు బాటకు రోడ్‌మ్యాప్ రెడీ చేసుకుంటుంది. హిందుత్వ, నాన్ హిందుత్వ ఫార్ములాతో తెలంగాణలో అధికారమనే కుంభస్థలాన్ని కొట్టాలని స్కెచ్ గీస్తోందంట. ఇప్పటికే జనజాగరణ పేరుతో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రానికి అందిస్తున్న నిధులు, చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ ఫోకస్ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లకే పరిమితమై చతికిల పడినప్పటికీ, తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 8 స్థానాలు దక్కించుకున్న కమలం పార్టీలో ఒకింత ధీమా పెరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు షాక్ లిచ్చి బీజేపీ ఫుల్ జోష్‌లో ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే సంస్థాగతంగా పార్టీ బలోపేతం, అధికారం పీఠం కైవసం చేసుకోవడంలో ఎందుకు విఫలమవుతోందనే చర్చ పొలిటికల్ సర్కిల్‌లో నడుస్తోంది

**ఎమ్మెల్సీ ఎన్నికల జోష్‌ను కంటిన్యూ చేయాలనే ఆలోచనలు**

తెలంగాణలో సంస్థాగతంగాపార్టీ బలోపేతమే లక్ష్యంగా కాషాయ పార్టీ అడుగులు వేస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల జోష్‌ను కంటిన్యూ చేయాలనే ఆలోచనలో అధిష్టాన పెద్దలు ప్రణాళికలకు పదును పెడుతున్నారంట. కానీ రాష్ట్ర నేతల వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తుండటంతో అధిష్టానం తలలు పట్టుకుంటుందంటున్నారు. పార్టీలో ఉన్న నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు పార్టీ ఎదుగుదలకు మైనస్ అవుతున్నాయనే టాక్ వినిపిస్తోంది.

**జీహెచ్‌ఎంసీ మేయర్ పీఠం కైవసం చేసుకోవడానికి కసరత్తు**

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాబోతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకొని, నగర మేయర్ పీఠాన్నీ కైవసం చేసుకునేందుకు బీజేపీ పార్టీ కసరత్తులు చేస్తుంది. 2020లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో 40కి పైగా సీట్లు సాధించిన బీజేపీ, మజ్లిస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే హైదరాబాద్ ప్రజలను అకట్టుకునేందుకు జీహెచ్‌ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేసి, హైదరాబాద్‌లో ఎంఐఎంను టార్గెట్ చేస్తూ హిందుత్వ ఎజెండాను సమర్ధంగా వినిపించిందని, భవిష్యత్తులో తమకు కావలసిన మైలేజీని పెంచుకుందంటున్నారు. వాస్తవానికి లోకల్ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీకి ఓటర్ల సంఖ్య లేకపోయినా, బరిలో నిలవడం వెనక జీహెచ్‌ఎంసీ ఎన్నికలే మెయిన్ టార్గెట్ అన్న వాదనలు ఆ పార్టీలోనే వినిపిస్తున్నాయి.

**9 నెలల్లో జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ గడువు**

లోకల్ బాడీ ఎన్నికలు మరో మూడు, నాలుగు నెలల్లో రాబోతున్నాయనే చర్చ జరుగుతోంది. అంతేకాదు 9 నెలల్లో జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ గడువు కూడా ముగియ నుండటంతో బీజేపీ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ సంస్థాగత బలం పెంచుకోవడానికి వ్యూహాలు పన్నుతోంది. పార్టీ కార్పొరేటర్లు ఉన్న డివిజన్లలో వారిని, కార్పొరేటర్లు లేని చోట డివిజన్ స్థాయి నాయకులు కాస్త ముందు నుంచే ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ ఆదేశించినట్లు కాషాయ శ్రేణులు

## ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన గుణ జిల్లాలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివపురి జిల్లా రిజోడా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గుణ జిల్లాలోని మావన్‌లో ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో భదౌరా పట్టణానికి సమీపంలోకి రాగానే రోడ్డుపై పశువులను తప్పించబోయే క్రమంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి (%ఋఱ్‌ఎ్‌ం ణజజజఅవత%) బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరిని మెరుగైన వైద్యం కోసం భోపాల్ తరలించారు. మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతులను గోవింద రఘువంశీ (28), సోనూ రఘువంశీ (35), వీరు కుశ్వాష్ (24), హితేశ్ బైరాగి (24)గా గుర్తించారు. వీరంతా రిజోడాకు చెందిన వారిగా మైనా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి గోపాల్ చౌబే తెలిపారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

## జగన్ రాబందుల పార్టీ అధ్యక్షుడు: నిమ్మల

అమరావతి, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైసిపికి కాదు రాబందుల పార్టీకి అధ్యక్షుడని ఎపి జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ప్రకృతి విపత్తు వల్ల జరిగిన ప్రమాదాన్నీ రాజకీయం చేస్తారా? అని నిమ్మల ప్రశ్నించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో నిమ్మల పర్యటించారు. మన రైతు- మన రామానాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బారికేడ్లు, పరదాలు, ముందస్తు అరెస్టులతో నాటి జగన్ పాలన సాగిందని మండిపడ్డారు. రాజధాని పునర్నిర్మాణం..రేపటి రోజు దేశ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.

# తరలిపోయిన ఏసీబీ ఆఫీస్.. ఆదిలాబాద్ నుంచి మంచిర్యాలకు షిఫ్ట్?



ఆదిలాబాద్ : ఉమ్మడి జిల్లాకు సేవలందించి అవినీతిపరుల్లో గుండె దడ పుట్టించిన అవినీతి నిరోధక శాఖ కార్యాలయాన్ని మంచిర్యాలకు తరలించారు. సుమారు 35 సంవత్సరాల పాటు ఆదిలాబాద్ కేంద్రంగా కైలాస్ నగర్ లో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఆఫీసును మంచిర్యాల జిల్లా కేంద్రానికి తరలించాలని ఏసీబీ డైరెక్టరేట్ నుండి వచ్చిన ఉత్తర్వుల మేరకు గురువారం ఇక్కడి ఆఫీసును మంచిర్యాలకు షిఫ్ట్ చేశారు. ఏసీబీ డీఎస్పీ ఛాంబర్ తో పాటు ఆఫీసు ఫర్నీచర్ ను వ్యాన్ లో ఎక్కించి మంచిర్యాలకు షిఫ్ట్ చేశారు.

మూడు దశాబ్దాలకు పైగా

మూడు దశాబ్దాలకు పైగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా ఏసీబీ డీఎస్పీ, సిబ్బంది ఇక్కడే విధులు నిర్వర్తించేవారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏసీబీ డీఎస్పీ ఆఫీస్, సిబ్బంది క్వార్టర్ల కోసం ఆదిలాబాద్ కైలాసనగర్ 348 సర్వే నంబర్ లో 16 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కూడా కేటాయించింది. జిల్లాల పునర్విభజన అనంతరం ఆదిలాబాద్ కేంద్రం అన్నింటికీ దూరంగా ఉండడం, మరోవైపు ఇక్కడ డీఎస్పీ, ఇద్దరు ఇన్ స్పెక్టర్లు, కానిస్టేబుళ్ళు, మరో ఏడెనిమిది మంది సిబ్బంది కోసం ఆఫీసు నిర్వహించడం కష్టసాధ్యంగా భావించి మంచిర్యాలకు షిఫ్ట్ చేసినట్లు తెలిసింది. ఏసీబీ కేసుల్లో పట్టుబడిన నిందితులను 24 గంటల లోపు కరీంనగర్ కోర్టుకు తరలించడం ఇబ్బందిగా మారినట్లు అధికారులు భావించారు. హడావుడిగా ఏసీబీ ఆఫీస్ మంచిర్యాలకు తరలించడం చర్చనీయాంశంగా మారింది.

8న మంచిర్యాలలో ప్రారంభం

మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకు దగ్గరగా వీలు కలిగే విధంగా మంచిర్యాలలో కొత్తగా ఏసీబీ డీఎస్పీ ఆఫీస్ ఈనెల 8న ప్రారంభం కానుంది. అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ తరుణ్ జోషి ఆఫీస్ ను ప్రారంభించనున్నట్లు సమాచారం. ఆఫీసు తరలింపు వల్ల ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు ఇక దూర భారం కానుంది. ముందుగా తెలిస్తే ప్రజా ప్రతినిధులు అడ్డుకునే అవకాశం ఉండడంతో గుట్టు చప్పుడు కాకుండా తరలించడం గమనార్హం. అదేవిధంగా గతంలో ప్రభుత్వం కేటాయించిన ఏసీబీ ఆఫీసు ఖాళీ స్థలం అన్యాక్రాంతం అయ్యే అవకాశం ఉంది. దీనికి వెంటనే ప్రహరీ గోడ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆఫీసు తరలింపు నిజమే : డీఎస్పీ

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా ఇంతకాలం పనిచేసిన ఏసీబీ డీఎస్పీ ఆఫీసు ఇక మంచిర్యాల కేంద్రంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వర్తించనున్నట్లు డీఎస్పీ విజయకుమార్ తెలిపారు. అయితే ఆదిలాబాద్ ఆఫీసును మాత్రం పూర్తిగా షిఫ్ట్ చేయలేదని చెప్పారు. ఇక్కడ ఓ కానిస్టేబుల్, హెూంగార్డ్ పనిచేస్తారన్నారు. మంచిర్యాల డీఎస్పీ పరిధిలో ఉమ్మడి జిల్లా కార్యకలాపాలు కొనసాగిస్తామని చెప్పారు.

## పలకరిస్తూ.. పెషన్లు పంచిన కలెక్టర్

విజయవాడ,ఎన్‌టీఆర్ భరోసా ద్వారా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి విజయవాడ అర్బన్ పరిధిలోని రామలింగేశ్వరనగర్‌లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్దాయనా బాగున్నారా.. పెన్షన్ సమయానికి అందుతోందా?, ఆరోగ్యం ఎలా ఉంది? ఎవరైనా మిమ్మల్ని డబ్బులు డిమాండ్

# కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,బీసీలకు న్యాయం చేయడానికి భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటి వరకు కులగణన జరగలేదని, దేశాన్ని దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తలేదని అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మండల్ కమిషన్ నివేదికను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పక్కకు పెట్టిందన్నారు. హస్తం పార్టీ బీసీలను పక్కకుపెట్టి ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. జనగణనలో కులగణన చేర్చాలని సుష్మాస్వరాజ్ ఆనాటి ప్రధానికి లేఖ రాశారు. దేశంలో కులగణన జరిగితే బీసీలకు సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయి. ఏ సామాజిక వర్గం వెనకబడి ఉందో గుర్తించవచ్చు. వెనకబడిన వర్గాల వారికి ప్రత్యేక పథకాలు రూపొందించేందుకు ఉపయోగ పడుతుంది. కులగణన నిర్ణయం తమ విజయంగా కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకొంటోంది. అలాంటప్పుడు కాంగ్రెస్ గత 60 ఏళ్లలో ఎందుకు చేయలేదు. ఇది రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డికి భయపడి తీసుకున్న నిర్ణయం కాదు. సామాజిక న్యాయానికి భాజపా కట్టుబడి ఉన్నందున కులగణన నిర్ణయం తీసుకున్నాం. కాంగ్రెస్‌లా.. ముస్లింలను బీసీల జనాభాలో చేర్చి మోసం చేయం. తెలంగాణ, కర్ణాటకలో కులగణనను కాంగ్రెస్ తూతూమంత్రంగా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది నిజమైన కులగణన కాదు' అని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రధాని మోడీ నేతృత్వంలో క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో జరగబోయే జనగణనలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.. ప్రధానికి హృదయపూర్వక ధన్యవాదాలు.. దేశంలో సానుకూలమైన మార్పుకు, కులగణన.. చరిత్రాత్మకమైన కులగణన, చరిత్ర పుటల్లో నిలిచిపోనుంది అన్నారు. ప్రతిపక్ష పార్టీలు నాటకాలకు తెరలేపుతున్నారు.. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లకు సంబంధించి, కుట్రలు కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. అలాగే, ముస్లింలను తీసుకెళ్లి బీసీల్లో చేర్చడం దారణం.. కాంగ్రెస్ అన్ని తప్పుడు నిర్ణయాలు చేసింది.. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ రాష్ట్రపతుల అభ్యర్థిత్వాలను వ్యతిరేకించింది అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మోడీ సర్కార్ ఎన్నో ఏళ్ల పెండింగ్ అంశం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టుకు తమ వైఖరిని స్పష్టం చేశాక.. వర్గీకరణ అంశంపై కోర్టు కీలక తీర్పు ఇచ్చింది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కనీస ఇంగిత జ్ఞానం లేకుండా మోడీనీ కులం పేరుతో దూషించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. కాంగ్రెస్ మొదటి నుంచి బీసీల పట్ల మొసలి కన్నీరే కార్చింది.. 2018లో మోడీ ప్రధాని అయ్యాక బీసీ కమిషన్ కు రాజ్యంగ బద్దంగా చట్టం చేశారు.. అన్ని వర్గాలకు న్యాయం చేయ్యాలని.. ఆర్థికంగా వెనకబడిన వర్గాల కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది మోడీ ప్రభుత్వం అని కిషన్ రెడ్డి అన్నారు. కాగా, మహిళల సాధికారిత కోసం 35 శాతం రిజర్వేషన్లు కల్పించామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ముస్లిం మహిళల కోసం ట్రిపుల్ తలాక్ రద్దు చేసి.. వాళ్లకు న్యాయం చేసింది మోడీ సర్కార్.. 1981 నుంచి 1931 వరకు కులగణన జరిగింది.. ఆ తర్వాత కులగణ జరక్కుండా కాంగ్రెస్ వ్యవహరించింది.. కులగణనకు కాంగ్రెస్ వ్యతిరేకం అని మండిపడ్డారు. మండలి కమిషన్ నివేదికను రాజీవ్ గాంధీ వ్యతిరేకించారు.. 2010లోనే సుష్మాస్వరాజ్ కులగణన అంశాన్ని లేవనెత్తారు.. సామాజికంగా అన్ని వర్గాలకు లబ్ధి జరగాలి అని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా.. దేశ హితం కోసమేనన్నారు. న్యాయ స్థానాలకు తీర్పుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోంది.. మేం చేసే కులగణనలో మతం ప్రాతిపదికన ఏ మతాలను బీసీల్లో చేర్చేది లేదు అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తేల్చి చెప్పారు.

# 'భూ భారతి'తో భూములు భద్రమేనా..? పేద రైతులకు మేలా..? కీడా..?




హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి పోర్టల్2025 ఏప్రిల్ 14న శిల్పాకళా వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ భూభారతి పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా నాలుగు మండలాల్లో అమలు చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో మద్దూరు మండలం, కామారెడ్డి జిల్లాలో లింగంపేట, ములుగు జిల్లాలో వెంకటాపూర్, ఖమ్మం జిల్లాలో నేలకొండపల్లి మండలాల్లో ఈ పోర్టల్‌ను అమలు చేస్తున్నారు. జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేయనున్నారు.ఈ ఏడాది జనవరి 9న రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్ యాక్ట్ -2025 భూభారతి చట్టంరూపం దాల్చింది. 19 సెక్షన్లతో ఏర్పాటైన ఈ చట్టం అమలు దిశగా అప్పట్నుంచే ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. భూ యజమానులు సులువుగా కొత్త చట్టాన్ని వినియోగించుకునేలా.. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, విశ్రాంత రెవెన్యూ అధికారులతో సమావేశాలు నిర్వహించి, సూచనలు, సలహాలు స్వీకరించింది. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో చట్టం అమలవుతున్నప్పుడు ఎలాంటి సమస్యలు ఎదురవుతాయనే విషయాలపై కూలంకషంగా చర్చించింది. ఆబాదీ భూములకు హక్కులు, రిజిస్ట్రేషన్ సమయంలో సర్వేపటం సమర్పణ, భూములకు గుర్తింపు సంఖ్య భూధార్ తదితర కీలకమైన సేవల అమలుకు కూడా కొత్త చట్టంలో మార్గదర్శకాలను రూపొందించింది.ఇక నాలుగు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా కొనసాగుతున్న నేపథ్యంలో.. భూ భారతి చట్టం రైతులకు చుట్టమని సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ధరణి పోర్టల్‌ను రద్దు చేసి.. రేవంత్ రెడ్డి సర్కార్ నూతనంగా రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025పై ఆయా నియోజకవర్గాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. భూ భారతి చట్టంపై ఉన్న అనుమానాలను, అపోహలను ప్రభుత్వ పెద్దలు, అధికారులు నివృత్తి చేస్తున్నారు.గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో భూ సమస్యలు పరిష్కారం కాకపోగా రైతులు నరకం అనుభవించారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పలు వేదికల మీద తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఏది చెబితే అదే చట్టంగా ఉండేదని విమర్శలు గుప్పిస్తున్నారు. దొర గారు ధరణి పథకాన్ని భూ స్వాముల కోసం తెచ్చి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపిస్తున్నారు. భూ భార తి చట్టం అలా కాకుండా పకడ్బందీగా పేదోడికి న్యాయం జరిగేలా రూపొందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం ద్వారా తహసీల్దార్, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ఏ ఇలా వివిధ స్థా యిల్లో భూ సమస్యలు పరిస్కారం అవుతాయని రెవెన్యూ మంత్రి చెబుతున్నారు. ఆయా స్థాయిలో పరిష్కారం కాకపోతే స్పెషల్ ట్రిబ్యునల్ ప్రవేశ పెట్టడానికి చట్టంలో వెసులుబాటు కల్పించినట్లు పేర్కొంటున్నారు. రెవెన్యూ అ ధికారులు ఉద్దేశపూర్వ కంగా తప్పులు చేస్తే ఈ చట్టం ద్వారా సదరు అధికా రిపై చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, భూ చట్టాల నిపుణులు ఎం సునీల్ కుమార్(భూమి సునీల్) భూ భారతి గురించి ఏమంటున్నారో తెలుసుకుందాం..

ధరణిలో ఉన్న ఇబ్బందులేంటి..? భూభారతిలో ఉన్న అనుకూలతలేంటి..?

ధరణి చట్టం చాలా సమస్యలకు పరిష్కారం చూపించడం లేదు. తెలంగాణ రైతాంగం భూమి రికార్డులకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలకు ఆ చట్టంలో పరిష్కారం లేదు. ఆ చట్టాన్ని సవరించితే కూడా సరిపోదు. ఆ చట్టాన్ని సమగ్రంగా మారిస్తే తప్ప తెలంగాణ రైతాంగ సమస్యలకు పరిష్కారం దక్కదు అని ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాతనే ధరణి స్థానంలో కొత్త చట్టం తీసుకురావాలని నిర్ణయం జరిగింది. 24 ముసాయిదాలు తయారయ్యాయి. 25 దఫాలుగా ఈ చట్టాన్ని మార్చుకుంటూ వెళ్లాం. ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. 11వ ముసాయిదా పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చిన తర్వాత అక్కడ్నుంచి ప్రజల అభిప్రాయాలను తీసుకుని విడుతల వారిగా చర్చించాం. ఆ తర్వాత అసెంబ్లీలోకి ముసాయిదా వెళ్లి చట్ట రూపమైంది. ప్రజాస్వామ్యయుతంగా సమస్యలకు పరిష్కారంగా ప్రజాభిప్రాయం మేరకు ముసాయిదా అసెంబ్లీ ముందుకు వెళ్లింది. సమస్యల పరిష్కారానికి సమాధానంగా, ప్రజాస్వామ్యంలో రాజ్యాంగానికి అనుగుణంగా చట్టం అమల్లోకి వచ్చింది.

ధరణిలో ఉన్న సమస్యలేంటి..?

సమస్యలు ఏంటంటే.. నాలుగు ప్రధాన సమస్యలు ధరణిలో ఉన్నాయి. ధరణి అనేది హక్కుల రికార్డు అంటే భూమి హక్కులు. హక్కులు రికార్డు చేసే చట్టం.. హక్కులు కల్పించే చట్టం కాదు ఇది. నాలుగేండ్లు కావొస్తుంది.. 18 లక్షల ఎకరాల భూమి ఇంకా హక్కుల రికార్డుల్లోకి ఎక్కలేదు. చాలా వరకు పట్టా భూములకు పరిష్కారం లేక పెండింగ్‌లో ఉన్నాయి. 99 శాతం రికార్డు బాగుందని నాటి ప్రభుత్వం ప్రకటించింది. కానీ వాస్తవ పరిస్థితి చూస్తే.. ధరణి తప్పుల మీద 20 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గ్రామ సభలు నిర్వహిస్తే ఒక్కో గ్రామంలో 200లకు తక్కువగా సమస్యలు రాలేదు. అంటే 25 లక్షల మంది రైతు కుటుంబాలకు ధరణిలో సమస్యలు ఉన్నాయి. కలెక్టర్, సీసీఎల్ఏ పరిష్కారం చేస్తున్నారనే సందేహం రావొచ్చు. ఆశ్చర్యకరం ఏందంటే ఆర్‌వోఆర్‌లో వారికి అధికారం లేదు. కానీ పరిష్కారం చేస్తున్నారు. ఎట్లా చేస్తారని హైకోర్టులో పిల్ పెండింగ్‌లో ఉంది. దానికి చట్టబద్ధత కల్పించాలి.

సాదా బైనామాకు పరిష్కారం ఉందా..?

సాదా బైనామాకు సంబంధించి 9 లక్షల 24 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి ధరణి చట్టంలో పరిష్కారం లేదు. ధరణి అనేది రికార్డు.. తప్పులు జరిగితే అప్పీల్ వ్యవస్థ లేదు. ఎలాంటి సమస్యకైనా కోర్టుకు ఎక్కాల్సిందే. ఇలా ఒక 15 రకాల ఇబ్బందులు ధరణి చట్టంలో ఉన్నాయి. వాటన్నింటిని మారుస్తూ.. ఈ సమస్యలకు భూ భారతి చట్టంలో పరిష్కారం చూపించాం.

అధికారులు ప్రజలకు వద్దకు వెళ్లి రికార్డులు సరి చేసిన వ్యవస్థ పోయి ప్రజలు తన రికార్డును ఎక్కడ చూసుకోవాలో తెలియని స్థితికి ఎందుకు జరిగింది టెక్నాలజీ వస్తున్న కాలంలో..?

ఈ ప్రశ్నలకు అందరం సమాధానాలు వెతుక్కోవాల్సి ఉంది. కాగితాల మీద రికార్డు ఉంటే ట్యాంపరింగ్, లంచగొండితనం పెరుగుతుందని భావించి కంప్యూటరీకరణ ఒక పరిష్కారం మార్గంగా భావిస్తూ వచ్చాం. 80వ దశకంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం భూమి రికార్డులను కంప్యూటరీకరణ చేయాలని నిర్ణయించింది. కంప్యూటరైజేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ పేరుతో ప్రాజెక్టు రాగా పైలట్ ప్రాజెక్టులో దేశ వ్యాప్తంగా 6 జిల్లాలు ఎంపిక అయితే ఒకటి రంగారెడ్డి జిల్లా. 2004లో వచ్చిన ఎన్‌ఆర్ఎల్ ఎంపీ, ఇప్పుడున్న డీఆర్ఎల్ఎంపీ కావొచ్చు.. రికార్డులన్నీ కంప్యూటర్‌లో భద్రపరచాలని చెబుతున్నాం.

భూపరిపాలనలో, రెవెన్యూ రికార్డుల మేనేజ్‌మెంట్‌లో, భూమి హక్కులకు భద్రత కల్పించడంలో కంప్యూటరీకరణ నూటికి నూరు శాతం విజయవంతం అయిందా..? ఇంకేమైనా ఇబ్బందులు ఉన్నాయా..? కంప్యూటరీకరణ తెచ్చిన కొత్త చిక్కులేంటి..?వీటికి సమాధానం వెతుక్కోవాలి. ఇంకోటి ఇంత కంప్యూటేషన్ ఎరలో కూడా ఈ దేశంలో ఒక సామాన్య రైతు తన భూమి హక్కులు చూసుకోవాలన్నా.. తన భూమి భద్రంగా ఉందని అనుకోవాలన్నా.. కంప్యూటర్‌లో ఉంటే భద్రంగా ఉంటాయని ఫీలవుతున్నాడా..? కాగితాల రికార్డు ఉండాలని కోరుకుంటున్నాడా..? ఈ రెండు ప్రశ్నలకు సమాధానం వెతుక్కోవాలి. భూ రికార్డుల ఆధునీకరణ మీద చాలా మంది రీసెర్చ్‌లు చేశారు. పీహెచ్‌డీలు కూడా చేశారు. వేల సంఖ్యలో వ్యాసాలు కూడా రాశారు. పెద్ద ఎత్తున చర్చలు కూడా జరిగాయి. ఇందులో రెండు మూడు అంశాలు పదే పదే చర్చకు వస్తున్నాయి. అవేంటంటే.. కంప్యూటరీకరణ జరిగినంత మాత్రాన అన్ని పరిష్కారం కాలేదు. కంప్యూటర్ ఈజ్ ఏ టూల్. నువ్వు ఏం పెడితే అది ఇస్తది తప్ప.. తప్పుడు రికార్డులను క్లీన్ చేసి పర్‌ఫెక్ట్ ఇవ్వదు. ఎస్ఆర్ శంకరన్ ఏమన్నారంటే.. ఈ రోజుకు కూడా రైతు తన భూమి హక్కులు భద్రంగా ఉండాలన్న కాగితాలే కీలకం. కంప్యూటర్ రికార్డు ఉండాలి.. అదే విధంగా రైతు వద్ద ఓ కాపీ ఉండాలి. ప్రభుత్వాలు కూడా కాగితాలు తెచ్చి ఇవ్వాలి.భూమి రికార్డుల ఆధునీకరణ - కంప్యూటరీకరణ అనగానే కర్ణాటక గుర్తుకు వస్తుంది. ఆ రాష్ట్రంలో 20 ఏండ్లుగా కంప్యూటరీకరణ జరుగుతుంది. భూమి కావేరి ప్రాజెక్టుల పేరుతో చాలా అభివృద్ధి సాధించిన కర్ణాటకలో రెండేండ్ల కింద ఇంటింటికి తిరిగి భూమి రికార్డుల పత్రాలను పంపిణీ చేశారు. ప్రతి రైతు తన భూమి హక్కులు ఈజీగా తెలుసుకునేందుకు మండల కేంద్రాల్లో ఏటీఎం లాంటి మెషీన్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. సర్వే నంబర్ కొడితే నకలు వస్తుంది. దిశాంక్ అనే యాప్ కూడా తీసుకొచ్చారు. దీంతో కర్ణాటక రైతులు తమ భూముల వివరాలను ఎప్పుడు పడితే అప్పుడు తమ హక్కులను తెలుసుకుంటున్నారు. అయినా కూడా రెండేండ్ల కింద భూమి రికార్డుల పత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. అంటే ధరణి కావొచ్చు.. రేపు రాబోయే భూ భారతి కావొచ్చు.. కంప్యూటరీకరణ ద్వారా రైతాంగానికి ఫలితాలు అందాలంటే కాగితాల రికార్డులు కూడా ఉండాలి. ఆన్‌లైన్ రికార్డుతో పాటు ఆఫ్ లైన్ రికార్డులు కూడా ఉండాలని చెబుతుంది భూభారతి. ఒక వ్యక్తికి ఏ విధంగా భూమి మీద హక్కు వచ్చినా రికార్డుల్లోకి ఎక్కేలా ఉండాలి. పీవోడీ చట్టాన్ని సవరించుకున్నప్పుడు పేదోడు అసైన్‌మెంట్ భూమి కొంటే ఆయనకే లావణి పట్టా ఇవ్వాలని చట్టం మార్చుకున్నాం. 2017 డిసెంబర్ 31 కంటే ముందు భూమి లేని పేద వ్యక్తి ఒక అసైన్‌మెంట్ భూమి కొంటే ఆయనకే లావణి పట్టా ఇవ్వాలని కలెక్టర్‌కు అధికారం ఇచ్చాం. మరి కలెక్టర్ రెగ్యులరైజ్ చేసినట్లు ఆర్డర్ ఇస్తే ఆర్వోఆర్‌కు ఎక్కాలి కదా..? కానీ రికార్డుల్లోకి ఎక్కించుకునేందుకు ధరణిలో అవకాశం లేదు. మరి వారి హక్కులకు చిక్కులు వచ్చినట్టే కదా..? మ్యుటేషన్ జరగక చాలా పెండింగ్‌లో ఉన్నాయి.

యాజమాన్య హక్కులు కలిగి ఉండి.. పట్టాకు ఎక్కని వారు ఉన్నారా..?

గడిచిన నాలుగైదు ఏండ్లుగా తెలంగాణలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంది. తెలంగాణలో యాజమాన్య హక్కులు పొందగలిగే అర్హతలు కలిగి ఉండి.. పట్టాకు ఎక్కని వారు బోలేడు మంది ఉన్నారు. 1989లో అప్పటి ఆర్వోఆర్ చట్టం అమలు చేశారు. ఈ ఆర్వోఆర్ చట్టాన్ని యథాతథంగా అమలు చేస్తే 90 శాతం మంది రైతులకు పాస్ పుస్తకాలు ఇవ్వలేం అన్నారు కలెక్టర్లు. ఎందుకంటే వీళ్లందరూ కాస్తులో ఉన్నారు. కాబట్టి కాస్తు కాలంలోకి ఎక్కించగలం కానీ పట్టా కాలంలోకి ఎక్కించేందుకు అర్హతలు లేవన్నారు. కొందరు సాదా బైనామా ద్వారా కొనుక్కున్నారు. సాయుధ పోరాటంలో జెండాలు పాతి భూములను పొందారు. ఆ భూ యజమానులు ఎక్కడో ఉన్నారు. వాళ్లేమో వీళ్లకు రాసివ్వలేదు. కేవలం కబ్జాల్లో ఉన్నారు. రక్షిత కౌలుదార్లు ఉన్నారు. ఇలా ఓ పదిహేను రకాల సమస్యలు కలెక్టర్లు చెప్పారు. 90 శాతం మంది రైతులు కాస్తులో ఉండి భూమి దున్నుకుంటూ ఉన్నారు. వారికి పట్టా కాలేదు. కాబట్టి వారికి కాస్తు కాలంలో ఉన్న పేరే ఏకైక ఆధారం. ఈ రోజున ఆ 90 శాతం మంది రైతులు పట్టా కాలంలోకి ఎక్కలేదు. కాస్తుదారు కాలం తొలగించడం ద్వారా వారి హక్కులకు సమస్యలు వచ్చాయని వారికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కానీ భూ భారతి చట్టంలో ఈ సమస్యలకు పరిష్కారం చూపించే ప్రయత్నం చేసింది.

పట్టా కాలంకు ఎక్కని వారు ఎంత మంది ఉన్నారంటే..?

2014 నాటికి సాదా బైనామా ద్వారానో మరో రకంగానో, యాజమన్యా హక్కులు ఉండి కాస్తు చేసుకుంటూ ఉండి పట్టా కాలంకు ఎక్కని వారు ఎంతో మంది ఉన్నారు. 2024 ధరణి ప్రకారం పోల్చుకుని చూస్తే ఆ లెక్కలు బయటపడుతాయి. కాస్తు కాలం తొలగించడంతో చాలా మంది తమ యాజమాన్య హక్కులు కోల్పోయారు. కొన్ని లక్షల మంది నష్టపోయి ఉంటారని చెబుతున్నారు. ధరణి వచ్చిన తర్వాత పట్టా కాలంలోకి ఉన్నవారికి బెనిఫిట్ జరిగింది. కాస్తు కాలంలో ఉన్నవారికి తీవ్ర నష్టం జరిగింది. ఇలా ఎంత జరిగిందంటే ఒక ఆడిట్ జరిగితే తప్ప బయట పడదు.కాస్తు కాలం పెట్టి కబ్జాలను ప్రోత్సహిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం.. అని బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది..? మరి పేద రైతులకు మేలు జరుగుతుందా..? కీడు జరుగుతుందా..?1971లో కాస్తు కాలం రాయాలని ఉంది. అంతకు ముందున్న 1948, 1936 చట్టంలో కూడా ఉంది. ఈ రోజున దేశ వ్యాప్తంగా ఆర్వోఆర్ చట్టం ఉన్న ప్రతి రాష్ట్రంలో కూడా ఆర్వోఆర్‌లో ఎవరెవరి పేర్లు రాయాలని ఉందంటే భూ యజమాని పేరు, కాస్తుదారు పేరు రాయాలని అన్నింట్లో ఉంది. ఒక్క ధరణి చట్టం తప్ప ఆంధ్రప్రదేశ్ చట్టంలో ఇంకా ఉంది. ఆక్యుపెంట్ కాలం ఉంటది. ఈ కాలం ఆర్వోఆర్‌తో పాటు విలేజ్ రికార్డుల్లో కూడా ఉంటుంది. ధరణి వచ్చిన తర్వాత ఆర్వోఆర్‌లో ఉన్న ఆక్యుపెంట్ కాలం తీసేశారు. పహణీ రాయడం మానేశారు కాబట్టి పహణీలో ఆక్యుపెంట్ కాలం లేదు. కేవలం ఆక్యుపెంట్ కాలంలో ఉన్నవారికి ఉన్న ఆధారం కాస్త ఎగిరిపోయింది. ఇది జరిగిన వాస్తవం. ఈ భూభారతి చట్టం ఏం చెబుతుందంటే ఆక్యుపెంట్ అనే వారు ఎవరు..? దానికి ఒక నిర్వచనం ఇచ్చారు. భూమి ఇప్పుడు సాగులో ఉండి ప్రభుత్వం నిర్దేశించిన షరతులకు లోబడి ఉన్న వారినే ఆక్యుపెంట్ అంటారు. వారి పేర్లను మాత్రమే ఎక్కిస్తారని చట్టంలో పేర్కొన్నారు. షరతులు ఏంటి..? ఎవరు ఎక్కిస్తారు అనేది చాలా కీలకమైన అంశం. అయితే ఇందులో కౌలుదారు పేరు రాయడానికి వీలు లేదు. కాస్తు కాలంలో యజమాని అయి ఉండి ఇంకా పట్టాకు నోచుకోని వాడి పేరును కాస్తు కాలంలో రాస్తాం. భూమిపై పూర్తి హక్కులు ఉన్నోడే యజమాని. పట్టా కాకపోతే వాడు ఓనర్ కాకుండా పోతాడా..? కాబట్టి టెక్నికల్‌గా ప్రాబ్లం ఉన్న రైతే ఆక్యుపెంట్ కాలంలో ఉంటాడు. చట్టం ప్రకారం.. 2014లో పహణీలో ఉన్న వారందరినీ తీసుకొచ్చి ఆక్యుపెంట్ కాలంలో రాయడానికి కుదరదు. ఒకటి 2014లో పోజిషన్‌లో ఉన్నాయన ఇప్పుడు కూడా ఉండాలి. ఇది కొత్త షరతు. ఇప్పుడు ప్రభుత్వం విధించబోయే షరతులన్నింటికీ లోబడి ఉండాలి. అయితే 12 ఏండ్లు కాదు.. 20 ఏండ్లు భూమి చేసుకున్న కౌలుదారు ఎప్పటికీ యజమాని కాలేడు. కౌలు అనేది అగ్రిమెంట్ ప్రకారం జరిగేది. భూమిని కొనుగోలు చేసినప్పుడే యజమాని అయ్యే అవకాశం ఉంది. 12 ఏండ్ల పాటు కౌలుదారుగా కొనసాగిన తర్వాత.. ఒక వేళ కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకుంటే ఆ భూమికి యజమాని కావొచ్చు. ఒకటి కొత్త ఆర్వోఆర్ చట్టం కౌలుదారుకు కొత్త ఆధారం సృష్టించదు. కౌలు 12 ఏండ్లు చేసుకున్నంత మాత్రాన యజమాని అయ్యే అవకాశం లేదు.

# వీరి మధ్య విభేదాలేంటి?

అమరావతి,నిన్నటి వరకు కయ్యానికి కాలుదువ్విన ఇద్దరు నేతలు..ఇప్పుడు ఆల్ హ్యాపీస్ అంటూ చెట్టాపట్టాలేసుకొని తిరుగుతున్నా, లోలోపల మాత్రం మంట రగులుతూనే ఉంటుందని ఆ నియోజకవర్గం నేతలు మాత్రం గుసగుసలాడుకుంటున్నారట.మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు మధ్య రేగిన వివాదాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మలుపు తిప్పారు. ప్రజా ఫిర్యాదులపై ఏర్పడిన శాసనసభ కమిటీ సమావేశాన్ని విశాఖలో ఏర్పాటు చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కూటమి పార్టీలోని ఇద్దరు నేతలతో సమావేశమయ్యారు.వారిద్దరితో అసలేం మాట్లాడారో..? ఎలా సర్ది చెప్పారో కానీ, రెండు రోజుల క్రితం చిర్రుబుర్రులాడిన గంటా.. ఎమ్మెల్యే విష్ణుతో చేతులు కలిపారు. దీంతో ఆ ఇద్దరి మధ్య చెలరేగిన వివాదానికి ఫుల్ స్టాప్ పడినట్లేనని చర్చ జరుగుతోంది. ప్రజా ఫిర్యాదులపై ఏర్పడిన శాసనసభ కమిటీకి అధ్యక్షత వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామక్రిష్ణంరాజు తొలి సమావేశాన్ని విశాఖలో ఏర్పాటు చేశారు.ఈ కమిటీలో రఘురామతోపాటు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, పల్లా శ్రీనివాసరావు, జగన్మోహన్, కొణతాల రామకృష్ణ సభ్యులుగా ఉన్నారు. అయితే రెండు రోజుల క్రితం విశాఖ నగరానికి చెందిన ఎమ్మెల్యేలు గంటా, విష్ణుకుమార్ రాజు మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే.ఇది జరిగిన రెండు రోజులకు డిప్యూటీ స్పీకర్ రఘురామ ఎంట్రీతో ఆ ఇద్దరి మధ్య గొడవకు శుభం కార్డు పడిందని అంతా చెబుతున్నారు. కూటమిలో ఉంటూ విపక్షంలా వ్యవహరించడం సరికాదన్న రీతిలో ఇద్దరూ ఇప్పుడు ఒక్కటైపోయారంట. పార్టీలు వేరైనా కూటమిలో కలిసికట్టుగా ఉంటూ విశాఖ అభివృద్ధి కోసం పాటుపడాలని ఇద్దరు సీనియర్ నేతలు కోరుకుంటున్నారని జిల్లా రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది.

కలెక్టర్‌కు వినతి పత్రం పంపడంతో వివాదం

విశాఖ ఫిల్మ్ నగర్ భూముల లీజు విషయంలో స్థానిక ఎమ్మెల్యే గంటాకు తెలియకుండా బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు మిగిలిన ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టర్ కు వినతి పత్రం పంపడం వివాదానికి దారితీసింది. ఈ అంశంపై విశాఖ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక సందర్భంగా కలుసుకున్న విష్ణు, గంటా.. ఫిల్మ్ నగర్ లీజుల విషయంపై బహిరంగంగా వాదులాడుకున్నారు. ఈ విషయంలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు క్షమాపణ చెప్పినా, గంటా తీవ్ర మనస్థాపంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.విశాఖ ఫిలింనగర్ క్లబ్ కు గత ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల భూమికి సంబంధించి కలెక్టర్ ను కలిసి విష్ణుకుమార్ రాజు లేఖ ఇవ్వడంపై గంటా మండిపడ్డారట. తన సంతకం లేకుండా తన నియోజకవర్గానికి సంబంధించిన అంశంపై కలెక్టర్ కు లేఖ ఎలా ఇస్తారంటూ విష్ణుపై గంటా ఆగ్రహం వ్యక్తం చేశారట.దీనిపై విష్ణుకుమార్ రాజు స్పందిస్తూఫిల్మ్ క్లబ్ కు కేటాయించిన భూమి అలాట్ మెంట్ లెటర్లో 33 ఏళ్లు అనేది మిస్సయ్యిందనిదీనిపై కరెక్షన్ చేయడానికే కలెక్టర్ ని కలిసి లేఖ ఇచ్చినట్లు వివరణ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే సంతకం తీసుకుని కలెక్టర్ కి ఇవ్వాలని..అలా జరక్కపోవడంతో గంటాకు విష్ణు సారీ కూడా చెప్పారట.

ఆ తర్వాత గంటా, రాజుకు మధ్య మాటల యుద్ధం

అయితే విష్ణు వర్సెస్ గంటా మధ్య గొడవలు ఇప్పటివి కావని..ఎప్పటినుంచో ఇద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటోందన్న చర్చ విశాఖ జిల్లా రాజకీయాల్లో నడుస్తోంది. ఎందుకంటే విశాఖ ఉత్తర నియోజకవర్గానికి విష్ణుకుమార్ రాజు ఎమ్మెల్యే. దాన్ని ఆయన కంచుకోటగా మార్చుకున్నారు.

# బీజేపీతో ఇక ముందూ అంతేనా ?




విజయవాడ:ఏపీ బీజేపీకి ఎంత బలం ఉంది అన్నది రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న ఎవరిని అడిగినా ఇట్టే చెబుతారు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన బీజేపీ పెద్ద ఎత్తున డిపాజిట్లు గల్లంతు చేసుకుంది. ఒక్క సీటూ గెలవలేదు. 2024లో మాత్రం పొత్తులతో ఎత్తులతో ఏకంగా ఎనిమిది అసెంబ్లీ సీట్లు గెలిచింది, మూడు లోక్ సభ సీట్లూ గెలుచుకుంది.ఇక చూస్తే వైసీపీ నుంచి బయటకు వచ్చి రాజీనామా చేసిన నలుగురు ఎంపీ సీట్లతో ఏర్పడిన ఖాళీలలో టీడీపీతో సమానంగా బీజేపీ సీట్లు దక్కించుకుంది. ఈ రెండు పార్టీలకు చెరో రెండు సీట్లు రాజ్యసభలో ఏపీ నుంచి ఉన్నాయి. జనసేనకు మాత్రం అసలు ప్రాతినిధ్యం లేదు.ఇక చూస్తే బీజేపీ ఎంపిక చేసిన రాజ్యసభ సీట్లలో ఒకరు తెలంగాణాకు చెందిన ఆర్ క్రిష్ణయ్య అయితే మరొకరు ఏపీకి చెందిన పాకా వెంకట సత్యనారాయణ. ఇలా బీజేపీ తన అవసరాలు ప్రాంతాలు పరిస్థితులు సామాజిక నేపథ్యం అన్నీ చూసుకుని అభ్యర్ధులను చట్ట సభలకు పంపుతోంది.అయితే ఏపీలో ఉన్న కేవలం ఎనిమిది మంది ఎమ్మెల్యేలతో బీజేపీకి ఈ రెండు సీట్లు దక్కుతాయా అంటే అది సందేహమే. టీడీపీ వంటి పెద్ద పార్టీ దన్ను ఉంది కాబట్టే అది సాధ్యమైంది. మరి ఇది ఇక్కడితో ఆగుతుందా లేక ఇక మీదట కూడా కొనసాగుతుందా %ం%అన్నదే తమ్ముళ్లకు పట్టుకున్న ధర్మ సందేహం.ఏపీలో 2025లో మరి కొన్ని రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతున్నాయి. అలాగే 2027లో కూడా మరిన్ని సీట్లు ఖాళీ అవుతాయి. 2029 ఎన్నికలకు ముందు కూడా ఖాళీ అవుతాయి. ఇలా మూడు విడతలతో పెద్ద ఎత్తున రాజ్యసభ సీట్లు ఖాళీ అయితే అందులో కూడా బీజేపీ వాటా పెద్దదిగానే ఉంటుందని అనుమానిస్తున్నారు.బీజేపీకి ఎంపీలు కావాలి. పైగా రాజ్యసభలో ఆ అవసరం ఎక్కువగా ఉంది. దాంతో బీజేపీ కోరుతోంది. మిత్రపక్షంగా ఉన్న టీడీపీ ఇస్తోంది ఇదే తరహాలో సాగుతూ ఉంటే కనుక ఏపీ నుంచి బీజేపీకే ఎక్కువ మంది రాజ్యసభ సభ్యులు వస్తారని అంటున్నారు. అలా చేసుకోవడమే బీజేపీ మార్క్ పాలిటిక్స్ అని అంటున్నారు.మరి ఉన్న సీట్లలో సగానికి సగం బీజేపీకి ఇచ్చేస్తే తమ సంగతి ఏమిటని తమ్ముళ్ళు అడుగుతున్నారు. బీజేపీతో కేంద్రంతో రాజకీయ అవసరాల కోసం టీడీపీ రాజ్యసభ అవకాశాలను వదులుకుంటోంది. ఏపీలో పోలవరం అమరావతి ప్రాజెక్టులు పూర్తి కావాలంటే కేంద్రం సహకారం తప్పనిసరి అని భావిస్తోంది.అయితే బీజేపీకే ఈ పొత్తు వల్ల ఎక్కువ ఎంపీ సీట్లు దక్కుతున్నాయని టీడీపీ ఆశావహులకు మొండి చేయి మిగులుతోందని పసుపు పార్టీలో చర్చ సాగుతోంది. ఇక మీదట అయినా పార్టీ కోసం కష్టపడిన టీడీపీ తమ్ముళ్ళకు గుర్తించాలని ఎంపీ సీట్ల విషయంలో ఫస్ట్ ప్రయారిటీ టీడీపీకే దక్కాలని అంతా కోరుతున్నారు. మరి అధినాయకత్వం ఏ విధంగా ఆలోచిస్తుందో చూడాలి. ఏది ఏమైనా 2014 నుంచి 2018 మధ్యలో టీడీపీతో బీజేపీ పొత్తు ఉన్నా ఇంత గరిష్టంగా లాభపడలేదని ఈసారి కేంద్రంలో బీజేపీకి టీడీపీ అవసరం ఎక్కువగా ఉన్నా కూడా ఏపీ పాలిటిక్స్ లో తన హవాను చాటుకుంటోంది అని అంటున్నారు. ఈ రాజకీయ మర్మం అర్థం కాక తమ్ముళ్ళు తమ పదవుల విషయంలో అయోమయంలో పడుతున్నారు.

# దూకుడు మీదున్న కొత్త కమిషనర్, బెంబేలెత్తుతున్న అధికారులు...




హైదరాబాద్, జీహెచ్ఎంసీలో గాడిలో పడుతుందా? గత ప్రభుత్వ పాలన నుంచి అధికారులు ఇంకా బయటకు రావడం లేదా? మొద్దు నిద్ర వీడడం లేదా? ప్రభుత్వం మారిన తర్వాత వచ్చిన కమిషనర్లు ఎంత చెప్పినా అధికారులు పట్టించుకోలా? అందుకోసమే తరచూ అధికారుల మార్పిడి జరుగుతోందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.మంగళవారం జీహెచ్ఎంసీ కొత్త కమిషనర్‌గా ఆర్‌వి కర్ణన్ బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళుతున్న కమిషనర్ ఇలంబర్తి నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. కర్ణన్ బాధ్యతలు తీసుకోగానే దిగువ స్థాయిలో సిబ్బందిలో టెన్షన్ మొదలైంది. నిజాయితీగా ఉండే ఆయన దగ్గర పని చేయగలమా? లేదా అన్న డౌట్ అప్పుడే కొందరి అధికారుల్లో మొదలైంది.

అధికారులకు చుక్కలు

కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న మరుసటి రోజు బుధవారం నుంచి ఫీల్డ్ విజిట్స్ మొదలుపెట్టారు కమిషనర్ కర్ణన్. ఫీల్డ్‌లో ఆయనకు ఏ ఒక్క అధికారి కనిపించలేక పోవడంతో షాక్ అయ్యారు. అధికారులు ఫీల్డ్‌లో లేకుంటే సమస్యలు ఎలా తెలుస్తాయన్నది ఆయన మాట. అధికారులందరితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారట కమిషనర్ కర్ణన్.జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు అందరూ ఉదయం ఐదున్నర గంటలకు ఫీల్డ్ మీద ఉండాల్సిందేనని ఆదేశించారు. ఒకవేళ ఎవరైనా లేని పక్షంలో నేరుగా తనకే చెప్పాలని ప్రస్తావించారు. ప్రతి రోజూ ఉదయం 6.30 గంటలకు అందరి అటెండెన్స్ పూర్తి చేయ్యాలని కంట్రోల్ రూమ్ అధికారులను కోరారు కమిషనర్. దీంతో గురువారం ఉదయం చాలామంది అధికారులు ఫీల్డ్‌లో దర్శనమిచ్చారు.

గతంలో ఆయన

జీహెచ్ఎంసీ అధికారులకు ప్రస్తుత కమిషనర్ కర్ణన్ గురించి బాగా తెలుసు. ఆరోగ్య విభాగంలో ఉన్నప్పుడు హైజీన్ ప్రమాణాలను ఉల్లంఘించిన నగరంలో రెస్టారెంట్లు, పబ్‌లు, ఐస్‌క్రీమ్ పార్లర్లపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా దాడులు చేశారు. ఆహార భద్రతపై ప్రజలలో మంచి అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు వాటిపై సోదాలు చేయడం, ఆపై ఫోటోలు సోషల్ మీడియాలో పెట్టడం జరిగింది.ఇన్నాళ్లు తాము ఇలాంటి ఆహారం తిన్నామా అంటూ సగటు వినియోగదారులు షాకయ్యారు. ఈ సమయంలో ఆయన్ని తీసుకొచ్చి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. దీంతో పని చేయని కొందరు అధికారులు బెంబేలెత్తుతున్నారు.

# కూటమి పాలనలో విచ్చలవిడిగా స్కాములు



అమరావతిన్యూఢిల్లీ, వైసిపి ప్రభుత్వ హయాంలో కార్యకర్తలకు అనుకున్న మేరన్యాయం చేయలేకపోయామని, జగన్ 2.0లో అందరికీ పెద్దపీట వేస్తామని మాజీ సిఎం, వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులతో గురువారం తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో విచ్చలవిడిగా స్కాములు జరుగుతున్నాయని తెలిపారు. ఇసుక, మట్టి, మద్యం ప్రతిదీ మాఫియా నడుస్తోందని విమర్శించారు. ఊరిలో ఎక్కడ చూసినా బెల్టు షాపులే దర్శనమిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దోపిడీ చేస్తున్నారని వివరించారు. రాష్ట్రమంతా దోచుకో, పంచుకో తినుకో అనే పద్దతి నడుస్తోందని, అడ్డగోలుగా భూ దోపిడీ సాగుతోందని పేర్కొన్నారు. రూపాయికి ఇడ్డీ రాకపోయినా ఎకరం భూమి మాత్రం ఇస్తున్నారని విమర్శించారు. ఊరుపేరులేని కంపెనీలకు భూములు దారధత్తం చేస్తున్నారని, మొబిలైజేషన్ అడ్వాన్సులు పేరిట దోచుకుంటు-న్నారని వివరించారు. చంద్రబాబుకు ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారని విమర్శించారు. ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు చూపించిన తెగువ అమోఘమని, నిబద్ధతతో నిలబడ్డారని పేర్కొన్నారు. విశ్వసనీయ రాజకీయాలు అంటే వైసిపి ప్రజాప్రతినిధులను చూసి చంద్రబాబు నేర్చుకోవాలన్నారు. రాష్ట్రం రాక్షస పాలనలో ఉందని, దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఓడినా ప్రజల గుండెల్లో ఉన్నామని తెలిపారు. వైసిసి కార్యకర్తలు ప్రజల వద్దకు కాలర్ ఎగరేసుకుని వెళ్లగలరని, టిడిపి శ్రేణులు వెళ్లే పరిస్థితి లేదని పేర్కొన్నారు. జగన్ హయాంలో ప్రతి ఇంట్లోకి నాలుగు వేళ్లు వెళ్లేవని, చంద్రబాబు వారి కంచాన్ని లాగేసుకున్నారని వివరించారు. కార్యకర్తలు పడుతున్న కష్టాలను చూశానని, వారివద్దకే జగన్ పాలన ఉంటు-ందని పేర్కొన్నారు.

# పొలిటికల్ టర్న్ తీసుకుంటున్న ఆపరేషన్ కగార్!



హైదరాబాద్,ఆపరేషన్ కగార్.. ఇప్పుడు పొలిటికల్ టర్న్ తీసుకుంటోంది. ఆదివాసీలను ఇబ్బంది పెట్టేలా బ్లాక్ హిల్స్ లో సెర్చ్ ఆపరేషన్ ఏంటన్న ప్రశ్నలను వామపక్షాలు, పౌరహక్కుల సంఘాలు, బీఆర్ఎస్ వినిపిస్తున్నాయి. పార్టీ నిర్ణయం తర్వాత శాంతి చర్చలపై నిర్ణయం దిశగా తెలంగాణ ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఛత్తీస్ గఢ్ వైపు నుంచి వచ్చిన బలగాలు కర్రెగుట్టలను ఈనెల 21న చుట్టుముట్టాయి. అప్పటి నుంచి కూంబింగ్ కొనసాగుతూనే ఉంది. మొత్తం 24 వేల మంది బలగాలతో ఆపరేషన్ కగార్ సంచలనంగా మారింది. బ్లాక్ హిల్స్, దుర్గం గుట్టలు మావోయిస్టులకు స్ట్రాటజిక్ లొకేషన్. ఇక్కడ కేంద్ర కమిటీ సమావేశాలు, ఇతర ప్లీనరీలు, భారీగా ఆయుధ డంపులు, ట్రైనింగ్ జరుగుతున్నదన్న ఉద్దేశంతో బలగాలు ఈ గుట్టలను రౌండప్ చేస్తున్నాయి. హెలికాప్టర్లు, డ్రోన్ల నిఘాలో జల్లెడపడుతున్నారు. అయితే ఈ ఆపరేషన్ తో తెలంగాణ పోలీసులకు సంబంధం లేదని పోలీస్ వర్గాలు అంటున్నాయి. కేంద్ర బలగాలే లీడ్ చేస్తున్నాయని చెబుతున్నారు. బ్లాక్ హిల్స్ లో ఆపరేషన్ కగార్ ను వెంటనే ఆపాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. అటు చర్చల విషయంపై మావోయిస్టుల లేఖలు కూడా బయటికొచ్చాయి. ఇక లెఫ్ట్ పార్టీల నేతలు, పౌర హక్కుల సంఘాలు కూడా ఆపరేషన్ కగార్ ను ఖండించాయి. శాంతి చర్చలు జరపాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నారు. కార్పొరేట్ శక్తులకు ఎదురు నిలిస్తే నేరమా అని ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు సరికాదని ప్రొఫెసర్ హరగోపాల్, కూనంనేని సహా పలువురు కామెంట్ చేస్తున్నారు. చర్చలకు వస్తామని అంటున్నా చంపడమేంటని ప్రశ్నిస్తున్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ కూడా ఆపరేషన్ కగార్ ను ప్రస్తావించారు. ఎన్ కౌంటర్లు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, బలవంతంగా మావోయిస్టులను అంతం చేయడం కాకుండా శాంతి చర్చలు జరపాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో 3,500 మంది నక్సలైట్లు లొంగిపోయారని, రెడ్ కారిడార్ రాష్ట్రాలు, రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అంటున్నారు. ఆపరేషన్ కగార్‌ను మారణకాండగా అభివర్ణిస్తూ తెలంగాణలో చాలా చోట్ల నిరసన ర్యాలీలు జరుగుతున్నాయి. భారత్ బచావో వంటి సంస్థలు ఆపరేషన్ కగార్ ను ఆపాలని తెలంగాణ మంత్రి సీతక్కను కోరాయి. అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్రలో భాగంగా ఆదివాసీలను బలిపశువులుగా చేస్తున్నారన్న ఆరోపణలు చేస్తున్నాయి తుడుం దెబ్బ వంటి సంస్థలు. కర్రెగుట్టలో ఆపరేషన్‌ను ఆపాలని, ఆదివాసీలు భయాందోళనలో ఉన్నారని, వారికి తాగునీరు కూడా అందని దుస్థితి నెలకొందని అంటున్నారు. మరోవైపు ఆపరేషన్ కగార్ పై రాష్ట్ర బీజేపీ నేతలు రియాక్ట్ అవుతున్నారు. చేతిలో తుపాకీ పట్టుకొని శాంతి చర్చలు అనడం ఎంత వరకు సమంజసం అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు.శాంతి చర్చల కంటే ముందు మావోయిస్టులు తుపాకులు వదలాలని, తుపాకులు వదిలేస్తున్నామని ప్రకటించి శాంతి చర్చలకు రావాల న్నారు. సో ఆపరేషన్ కగార్ కాస్తా పొలిటికల్ కగార్ గా మారిపోయింది. ఇది ఇప్పుడు తెలంగాణలో ఇదోక సెన్సిటివ్ ఇష్యూ గా మారింది. బలగాలు మాత్రం కూంబింగ్ ఆపడం లేదు. రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందన్న ఉత్కంఠ పెరుగుతోంది.

# రాహుల్ గాంధీ ముందు చూపున్న నేత



హైదరాబాద్,రాహుల్ గాంధీ జోడో యాత్రలో దేశ ప్రజల సమస్యలకు పరిష్కారం చేసే దిశగా అడుగులు వేశారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. భారత్ జోడో యాత్రలో ప్రధాన అంశం కుల గణన.. కుల గణన చేయాలని రాహుల్ గాంధీ పదే పదే చెప్పారు.. ఇప్పుడున్న కేంద్రం కుల గణన చేస్తామని ప్రకటన చేయడం స్వాగతిస్తున్నాం.. రాహుల్ గాంధీ ముందు చూపుతో ఉన్నాడు అనడానికి కుల గణన ఒకటి.. దేశ రాజకీయాల్లో రాహుల్ గాంధీ హీరో.. రాష్ట్రంలో కుల గణన చేసినందుకు రేవంత్ రెడ్డి హీరో అని కొనియాడారు. ఇప్పుడు బీజేపీ వాళ్లు సంకలు గుద్దుకున్న లాభం లేదు.. రాహుల్ గాంధీకి ఎంత ముందు చూపు ఉందో అర్థం అవుతుంది.. మోడీ చేయకపోతే.. రాహుల్ గాంధీ ప్రధాని కాగానే ఆయనే చేసే వాడు అని జగ్గారెడ్డి తెలిపారు. అయితే, రాష్ట్రంలో కుల గణన లెక్కలోకి రాని వారు.. కేంద్ర కులగణనలో లెక్కకు వస్తారు అని జగ్గారెడ్డి పేర్కొన్నారు. రెండేళ్ల క్రితమే మోడీ చెప్తే బాగుండేది అనుకుంటున్నారు.. రాహుల్ గాంధీకి క్రెడిట్ వస్తుందని బీజేపీ నేతలకు మింగుడు పడటం లేదు.. రాహుల్ గాంధీ అనే వరకు మోడీ ఎందుకు ఎదురు చూశాడని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి వచ్చిన ఐడియా మోడీకి ఎందుకు రాలేదంటూ సెటైర్లు వేశాడు. బీజేపీ వాళ్ళ లెక్క పదవుల కోసం ఎదురు చూసే రకం కాదు రాహుల్ కుటుంబం.. వాళ్ళే ప్రధాన మంత్రులను చేస్తారు.. కొందరికి భయం ఉంటది.. రేవంత్ కుల గణన చేసి మార్కులు కొట్టి పడేశాడన్నారు. రేవంత్ కూడా అదృష్టవంతుడు.. రాహుల్ గాంధీ లైన్ లో వెళ్లి జాక్ పాట్ కొట్టేశాడు అని టీ-పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఇక, కిషన్ రెడ్డి ఇప్పుడు ఏం అన్నా లాభం లేదు అని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చెప్పారు. సుష్మ స్వరాజ్ 2010లో అంటే.. ఇప్పటి వరకు ఎందుకు చేయలేదు మీరు.. మీరేం చెప్పినా కుల గణన హీరో రాహుల్ గాంధీ.. కుల గణనలో ఇతర మతాల వారు ఉండరని కిషన్ రెడ్డి కాదు మోడీ చెప్పాలన్నారు. కిషన్ రెడ్డికి ఇష్టం లేదు కదా అని వదిలేస్తారా..?.. ప్రధాని ఏం చెప్తారో చూసి మాట్లాడదాం.. ముస్లింలు భారత దేశ పౌరులు కదా..? అని ప్రశ్నించారు. దేశంలో పుట్టిన హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు అంతా భారత దేశ బిడ్డలే కదా అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# దిక్కుతోచని స్థితిలో ఆ 10 మంది ఎమ్మెల్యేలు..



హైదరాబాద్,గులాబీ గూటినుంచి కాంగ్రెస్ లోకి వలస వచ్చిన 10 మంది పరిస్థితి ఇప్పుడు ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారిందట. వలసొచ్చిన కాంగ్రెస్ పార్టీలో మనస్ఫూర్తిగా ఉండలేకపోతున్నారు. అలాగని తిరిగి బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారన్న చర్చ తెలంగాణ రాజకీయవర్గాల్లో జరుగుతోంది.మరోవైపు సుప్రీంకోర్టు ఏ క్షణంలో ఎలాంటి తీర్పునిస్తుందో అన్న టెన్షన్ 10 మందిని వెంటాడుతోందట. భవిష్యత్తు బావుంటుందన్న ఆశతో అధికార హస్తంపార్టీలో చేరితే..మొదటికే మోసం వస్తుందా అన్నమానాలు వారిని వెంటాడుతున్నాయట. బీఆర్ఎస్ పార్టీలో కారుగుర్తుపై గెలిచి..ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలంతా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారట.కాంగ్రెస్ లో చేరిన వెంటనే తాము కూడా అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా ఉంటూ ఇక అన్ని వ్యవహారాలు చక్కబెట్టుకోవచ్చని అంతా భావించారు. కానీ ఇక్కడే వ్యవహారం బెడిసికొట్టింది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఆ పది మంది ఎమ్మెల్యేలను అధికార కాంగ్రెస్ పార్టీ పెద్దగా గుర్తించడంలేదట.ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి, పార్టీలోని ముఖ్య నేతలు, మంత్రులెవరూ తమను పెద్దగా పట్టించుకోవడంలేదని..పార్టీలోకి వస్తే ఇది చేస్తాంఅది చేస్తామంటూ ఇచ్చిన హామీలపై కనీసం మాటకూడా మాట్లాడడంలేదని 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ, ప్రభుత్వ తీరుపై గుర్రుగా ఉన్నారట. దీంతో తాము పార్టీ మారి తప్పు చేశామా అనే సందిగ్ధంలో పడ్డారట ఆ 10 మంది ఎమ్మెల్యేలు.అయితే కొంత మంది ఎమ్మెల్యేలు తిరిగి గులాబీ గూటికి వెళ్తే ఎలా ఉంటుందని ఆలోచన కూడా చేసినట్లు తెలుస్తోంది. గూడెం మహిపాల్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, దానం నాగేందర్ వంటి వలస ఎమ్మెల్యేలు మళ్ళీ బీఆర్ఎస్ లోకి వెళ్లేందుకు ప్రయత్నం కూడా చేశారన్న టాక్ రాజకీయవర్గాల్లో విన్పించినా..ఆ పది మంది ఎమ్మెల్యేలను ఎట్టిపరిస్థితుల్లోనూ తిరిగి పార్టీలోకి తీసుకోవద్దని గులాబీ బాస్ కేసీఆర్ స్ట్రాంగ్ నిర్ణయం తీసుకున్నారట.

ఆ ఎమ్మెల్యేలకు నో ఛాన్స్

పార్టీలోకి వచ్చేందుకు ట్రై చేసిన ఆ ఎమ్మెల్యేలకు నో ఛాన్స్ అని వారి మొహం మీదే చెప్పేశారట పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. దీంతో ఏం చేయాలో పాలుపోక..బిక్కమొహంతో కాంగ్రెస్ పార్టీలో కొట్టుమిట్టాడుతున్నారట పార్టీ మారిన ఆ 10 మంది ఎమ్మెల్యేలు. తమ రాజకీయ భవిష్యత్ ఏంటంటూ దిగాలుగా ఉన్నారని పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది.ఇదిలా ఉంటే మరోవైపు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ కేటీఆర్, పాడికౌశిక్ రెడ్డి సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేయడంతో..ఏ క్షణంలో కోర్టు ఎటువంటి తీర్పునిస్తుందో అని తెగ టెన్షన్ పడుతున్నారట వారంతా. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారని స్పీకర్ పై ఇప్పటికే తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు..స్పీకర్ తో పాటు ఆ పదిమంది ఎమ్మెల్యేలకు కూడా నోటీసులు ఇచ్చి విచారణ కూడా జరిపింది.దీంతో కోర్టు తీర్పుపై ఆ 10మంది ఎమ్మెల్యేల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే తమపై ఖచ్చితంగా వేటు పడడం ఖాయమంటూ కొంతమంది ఎమ్మెల్యేలు అనుమానం వ్యక్తం చేస్తున్నారట. ఒకవైపు కాంగ్రెస్ లో ఉండలేక, మరోవైపు తిరిగి గులాబీ గూటికి వెళ్లలేక ఆ పది మంది ఎమ్మెల్యేలు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారన్న టాక్ వినిపిస్తోంది.మొత్తానికి కారుగుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఆ 10 మంది ఎమ్మెల్యేల పరిస్థితి కక్కలేక, మింగలేక అన్నట్లుగా ఉందట. వెళ్లే దారులన్నీ మూసుకుపోవడంతో ఎలా ముందుకు వెళ్లాలో%ఠా%ఏం చేయాలో తెలియక తికమక పడుతున్నారట. సుప్రీంకోర్టు తీర్పు తర్వాతే వీరి పరిస్థితిపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉందంటూ తెలంగాణ రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. పార్టీమారిన ఎమ్మెల్యేలపై ఒకవేళ సుప్రీంకోర్టు తీర్పుతో అనర్హత వేటు పడితే మాత్రం ఉప ఎన్నికలు రావడం ఖాయం.అయితే బై ఎలక్షన్లో గెలిస్తే సరి..ఒకవేళ ఓడిపోతే భవిష్యత్ ఏంటన్న ఆందోళన పార్టీ మారిన ఆ 10 ఎమ్మెల్యేలను వెంటాడుతోందట. ఎందుకంటే సుప్రీం తీర్పు నేపథ్యంలో బై ఎలక్షన్స్ వస్తేఆ 10 నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాలను దించాలని ఇప్పటికే గులాబీ బాస్ కేసీఆర్ ప్రయత్నాలను మొదలుపెట్టినట్లు టాక్ విన్పిస్తోంది. ఆ దిశగా ఇప్పటికే కాంగ్రెస్ లో అసంతృప్తితో కొట్టుమిట్టలాడుతున్న నేతలకు గాలం వేస్తున్నట్లు సమాచారం. ఐతే ఇవన్నీ లెక్కలు తేలాలంటే సుప్రీంకోర్టు తీర్పునిచ్చేవరకు వెయిట్ చేయాల్సిందే.

# ప్రతికూల పరిస్థితులతో రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేత



మహబూబ్‌నగర్,ఎస్ఎల్బీసీ టన్నెల్ సంఘటన దురదృష్టకరం అని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. బాధ్యతగా ఆ కుటుంబ సభ్యులను ఆదుకుంటాం.. దొరకని ఆరు మృతదేహాలు బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలుపుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వపరంగా ఒక్కో కుటుంబానికి 25 లక్షల నష్ట పరిహారం చెల్లించాం.. జియో లాజికల్ సర్వే సూచన మేరకే రెస్క్యూ ఆపరేషన్ నిలిపివేశాం.. ఆరు మృతదేహాల ఘటన స్థలంలో క్రిటికల్ కండిషన్ ఉంది, రెస్క్యూ సిబ్బంది ప్రాణాలకు ముప్పు పొంచి ఉండటంతో పనులు ఆపేశామని అన్నారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ పనుల పూర్తి కోసం హై లెవెల్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ కమిటీ వేశామన్నారు. 2026 మార్చి 31వ తేదీ వరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ హామీ ఇచ్చారు. అయితే, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు వేగవంతానికి చర్యలు చేపట్టి 2027 మార్చి నాటికి ఉదండాపూర్ వరకు నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రాజెక్టుల కోసం భూ సేకరణకు సత్వర చర్యలకు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నాం.. పాలమూరు జిల్లా గత బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. టీఆర్ఎస్ హయాంలో కృష్ణా నది జలాల కేటాయింపులో పాలమూరు, నల్లగొండకు తీరని అన్యాయం జరిగింది అన్నారు. 819 టీ-ఎంసీల కృష్ణ జలాలను ఆంధ్రకు కేటాయిస్తుంటే.. కేసీఆర్ సర్కార్ చోద్యం చూసిందన్నారు. 299 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు వాటా దక్కింది.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం లక్ష కోట్ల ప్రజాధనం గోదావరి పాలు చేశారు.. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు మరో రెండు ఏళ్లలో పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com